




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నెగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 169 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం 12 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-


### మహిళల జీవనోపాధిని ప్రోత్సహించేందుకు..

# వెదురు ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

## వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళల ఆర్థిక సాధికారత, వాతావరణ చర్యలు, ప్రకృతి ఆధారిత సుస్థిర వాల్యూ చైన్స్ అభివృద్ధి రంగాల్లో ముందంజలో ఉన్న భారతదేశంలోని ప్రముఖ సంస్థలలో ఒకటైన ఇండస్ట్రీ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎస్ఆర్ఎల్‌యం), సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) భాగస్వామ్యంలో, పోలవరం జిల్లాలోని మారేడుమిల్లి మండలంలో వెదురు (బేంబూ) ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ (పిపియూ)ను ప్రారంభించింది. ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత పర్యావరణ సంపద కలిగిన,గిరిజన ప్రాంతాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇక్కడ వెదురు వనరులు సమృద్ధిగా లభ్యమవుతాయి మరియు సమాజ ఆధారిత, సుస్థిర జీవనోపాధులను సృష్టించే గొప్ప అవకాశాలను కలిగి ఉన్నాయి.పిపియూ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం వ్యవహారాలు, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి, అలాగే సెర్ప్ సీఈఓ ఐఏఎస్ అధికారి వి. కరుణ, పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగంతో సన్నిహితంగా పనిచేస్తూ, జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ నాయకత్వంలో పిపియూ సదుపాయానికి అవసరమైన భూమిని గుర్తించి ఖరారు చేశారు. యూనిట్‌కు అవసరమైన యంత్రాలు కొనుగోలు చేయడం, ఇతర సంబంధిత ప్రక్రియలు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం ఈ సదుపాయం పూర్తిగా కార్యకలాపాలను ప్రారంభించింది. మొదటి ట్రయల్ రన్‌ను మహిళా బేఃబూ రైతులే నిర్వహించారు. ఈ కార్యక్రమంపై సెర్ప్ సీఈఓ,ఐఏఎస్ అధికారి వి. కరుణ మాట్లాడుతూ "మారేడుమిల్లిలో ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపన ఆంధ్రప్రదేశ్‌లో వెదురు ఉపరంగాన్ని మిగతా .. 2లో..

### ఎల్‌పీజీ అంశం..

# వదంతులు పట్టించుకోవద్దు

## ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ లభ్యతపై ఆందోళన నెలకొంది. అయితే, ఈ వ్యవహారంలో వదంతులను పట్టించుకోవద్దని, ఆందోళనకు గురికావద్దని ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. ధ్రువీకరించిన సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తమిళనాడు తిరుచిరాపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించిన మిగతా .. 2లో..

# ఏపీ ప్రజల ఆకాంక్షే 'మనమిత్ర'కు ప్రేరణ

## మంత్రి నారా లోకేష్



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** యువగళం పాదయాత్ర సమయంలో రాష్ట్ర ప్రజలు వ్యక్తం చేసిన ఆకాంక్షే 'మనమిత్ర' వాట్సప్ సేవలకు ప్రేరణ అని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. దిల్లీలో మెటా మిగతా .. 2లో..

### దుబాయ్ ఎయిర్‌పోర్టు సమీపంలో

# డ్రోన్ల దాడులు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలోని పలు దేశాలపై ఇరాన్ దాడులు పెంచుతోంది. తాజాగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ల దాడులు జరిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో నలుగురు గాయపడినట్లు తెలిపారు. క్షతగాత్రుల్లో ఒకరు భారత వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ పరిణామాలతో ప్రయాణికులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బందికి అధికారులు సేఫ్టీ నోటీసు జారీచేశారు. మరో వైపు విమానాశ్రయంలో ఇప్పటికే షెడ్యూల్ చేసిన పలు విమాన సర్వీసులు కొనసాగుతున్నాయన్నారు. డ్రోన్ల దాడులతో విమానాశ్రయంలో పొగ కమ్మేసిన దృశ్యాలు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. నిత్యం మిగతా .. 2లో..

# గతంలో రవికుమార్ దొరికితే ఏం చేశారు?

## తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి




**తిరుపతి (గాంధీరోడ్డు), విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమలను లక్ష్యంగా చేసుకుని వైకాపా నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడేపల్లిలో ఉన్న జగన్.. ఏడుకొండలపైకి అనకొండలను పంపిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని అనకొండలు వచ్చినా ఆదిశేషుడి ముందు తోక ఆడించలేరని మండిపడ్డారు. 11 నెలల క్రితం జరిగిన ఘటనను నిన్న జరిగినట్లుగా కరుణాకర్ రెడ్డి నానా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. "పరకామణిలో చోరీకి యత్నించినప్పుడు పెంచలయ్య అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని మేం జైలుకు పంపాం. గతంలో రవికుమార్ దొరికితే మీరేం చేశారు? వాటాలు పంచుకుంది మీరు కాదా? విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ ద్వారా రవికుమార్ విజువల్స్‌ను మాయం చేసింది మీరు కాదా? శ్రీవారి హుండీలో కానుకలు పడకుండా వైకాపా కుట్ర చేస్తోంది" అని భానుప్రకాష్‌రెడ్డి అన్నారు.

**అసలేం జరిగిందంటే..**

తిరుమల శ్రీవారి పరకామణిలో మిగతా .. 2లో..

# గుడివాడ కేంద్రంగా బెట్టింగ్

## కొడాలి నాని అనుచరుడు సహా ఐదుగురి అరెస్టు




**గుడివాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా గుడివాడలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు మసాలా శివతో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. బెట్టింగ్ రాయుళ్ల నుంచి రూ.1.05 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టిడ్కో కాలనీ ఫ్లాట్లలో మసాల శివ, అతని అనుచరులు యాప్‌లలో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ బెట్టింగ్‌కు పాల్పడ్డారు. మసాల శివ ఫోన్‌లో పలువురు పోలీసు అధికారుల వ్యక్తిగత, వైకాపా ముఖ్య నేతల నెంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించి వాట్సప్ చాటింగ్, ఫోన్ స్క్రీన్ షాట్లను గుర్తించామని గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు తెలిపారు. బెట్టింగ్ నిర్వాహకుడు మసాలా శివ, అతనికి సహకరిస్తున్న భాను ప్రసాద్, కనక మహేశ్, అజయ్ బాబు, వంశీ కిరణ్‌లను అరెస్టు చేశామన్నారు. మరో 17 మంది బుకీలు, బెట్టింగ్‌లలో భాగస్వామ్యులైన మరో 92 మందిని గుర్తించామని మిగతా .. 2లో..

### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో

# జగన్ గుండెల్లో గుబులు

## ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక వ్యవస్థ గురించి జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. జగన్ హయాంలో మున్సిపల్ ఆఫీసులను కూడా తాకట్టు పెట్టారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని పాలసీతో రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. "కేంద్రానికి లేఖ రాస్తానని జగన్ చెబుతున్నారు. ఆయన చిట్టా మొత్తం కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది. భవిష్యత్తు తరాలకు సంపద కావాలంటే చంద్రబాబు మిగతా .. 2లో..

### ఆమె బాధే 'కారుణ్య మరణానికి' నాంది..

# ఎవరీ అరుణా షాన్‌బాగ్..?



**విశ్వం వాయిస్ న్యూస్ :** దాదాపు 13 ఏళ్లుగా జీవచ్ఛవంలా ఉన్న 32 ఏళ్ల హరీశ్ రాణాకు సుప్రీంకోర్టు కారుణ్య మరణం ప్రసాదించింది. అతడికి ప్రాణాధార చికిత్స వ్యవస్థలను తొలగించేందుకు అంగీకరించింది. ఇలా ఓ వ్యక్తి 'కారుణ్య మరణానికి' అనుమతినివ్వడం మన దేశ చరిత్రలో ఇదే తొలిసారి. అయితే, దీనికి నాంది పడింది మాత్రం పదిహేనేళ్ల కిందటే. 2011లో అరుణా షాన్‌బాగ్ కేసులో తొలిసారి ఈ 'కారుణ్య మరణాన్ని' సుప్రీంకోర్టు గుర్తించింది. ఇంతకీ ఎవరామె..?

**40 ఏళ్లుగా నరకయాతన..**

మహారాష్ట్రలోని కింగ్ ఎడ్వర్డ్ ఆసుపత్రిలో 1967లో అరుణా షాన్‌బాగ్ నర్సుగా చేరారు. అప్పుడు ఆమె వయసు 25 ఏళ్లు. అక్కడ పనిచేస్తున్న డాక్టర్ సందీప్ సర్దేశాయ్ మిగతా .. 2లో..

### లోక్‌సభ స్పీకర్‌పై

# వీగిన అవిశ్వాసం



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో వీగిపోయింది. స్పీకర్ సభలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ విపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నుంచి నేటి వరకు సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్షాలు చేసిన విమర్శలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మిగతా .. 2లో..

### ప్రోత్సాహకాలు లేకుండా పెట్టుబడులకు

# ఎవరు ముందుకొస్తారు?

## ఏపీ హైకోర్టు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో పలు సంస్థలకు భూ కేటాయింపులపై వైకాపా ఎంపీ గురుమూర్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. విభజన తర్వాత ఏపీ వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మిగిలిందని, ఈ నేపథ్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని పేర్కొంది. ప్రోత్సాహకాలు లేకుండా పెట్టుబడులకు ఎవరు ముందుకొస్తారని ప్రశ్నించింది. భూకేటాయింపుల్లో ప్రభుత్వ విధానాన్ని విస్తృత కోణంలో చూడాలని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ పాలసీలతో మరో 200 ఏళ్ల ప్రయోజనాలు ఉంటాయని తెలిపింది. "ఏపీ మిగతా .. 2లో..

### డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు..

# విచారణకు లక్ష్మీదుర్గ హాజరు కావాలి : హైకోర్టు




**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడకు చెందిన దళిత యువకుడు, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో విచారణకు రావాలని వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తనపై ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇచ్చిన వారెంట్ రద్దు చేయాలని లక్ష్మీదుర్గ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన కోర్టు.. ఈ నెల 16 నుంచి 30 వరకు దర్యాప్తు అధికారుల ముందు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 30న మిగతా .. 2లో..

### నేను ఎప్పుడు అనుకుంటే

# అప్పుడే యుద్ధం ముగుస్తుంది

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌పై యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అన్ని లక్ష్యాలను ఛేదించామని, ఇంకేమీ మిగల్లేదని అన్నారు. ఓ వార్తా సంస్థకు టెలిఫోన్ ఇంటర్వ్యూ ఇచ్చిన అధ్యక్షుడు ట్రంప్.. తాను ఎప్పుడు అనుకుంటే అప్పుడు యుద్ధం ముగుస్తుందన్నారు. "ఇరాన్‌లో భీకర యుద్ధం మిగతా .. 2లో..

### యుద్ధం ఎఫెక్ట్.. చమురు రిజర్వులను

# విడుదల చేయనున్న జపాన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు అనేక దేశాలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. చమురు సరఫరాలో అంతరాయమే ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ క్రమంలో జపాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ వద్ద ఉన్న చమురు నిల్వల్లో కొంత భాగాన్ని విడుదల చేస్తామని ప్రకటించింది. మార్చి 16 కల్లా వాటిని మార్కెట్లోకి తీసుకొస్తామని తెలిపింది. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### మహిళల జీవనోపాధిని ప్రోత్సహించేందుకు..

# వెదురు ప్రోసెసింగ్ యూనిట్ ప్రారంభం

బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. వెదురు విలువ గొలుసు కార్యక్రమం భాగంగా, ఈ సదుపాయాన్ని రాష్ట్రానికి ఆదర్శ ప్రాసెసింగ్ యూనిట్‌గా అభివృద్ధి చేయాలని తాము భావిస్తున్నామని,. సెర్ప్,జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం ద్వారా భూమి కేటాయింపు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగంగా పూర్తి చేసి ఈ యూనిట్‌ను తక్కువ సమయంలోనే కార్యకలాపాలు ప్రారంభించేలా చేశామన్నారు. సుమారు 8,000-9,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ యూనిట్, వెదురు సాగు, మార్కెట్‌కు సిద్ధమైన ఉత్పత్తుల మధ్య కీలక సంబంధాన్ని ఏర్పరచడమే కాకుండా, ఈ ప్రాంతంలోని మహిళలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలను కల్పిస్తుంది." అన్నారు. ప్రపంచంలోని వెదురు వనరులలో దాదాపు 30 శాతం భారతదేశంలోనే ఉన్నాయి. గ్రామీణ మరియు గిరిజన సమాజాలకు, ముఖ్యంగా మహిళల ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా, ఈ రంగాన్ని సుస్థిర జీవనోపాధి అవకాశంగా మరింతగా ప్రోత్సహిస్తున్నారని, ఈ ప్రాసెసింగ్ సదుపాయం స్థాపనతో స్థానిక బాంబూ విలువ గొలుసు మరింత బలపడుతుందని చెప్పారు. వెదురు సేకరణ, ప్రాథమిక ప్రాసెసింగ్, మెరుగైన మార్కెట్ అనుసంధానాలను అందిస్తుందని ఆశిస్తున్నారని కరుణ పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యంపై ఇండస్ట్రీ ఫౌండేషన్ సీఈఓ నేజు జార్జ్ అబ్రహం మాట్లాడుతూ "భారతదేశంలోని వెదురు రంగం వాతావరణానికి అనుకూలమైన జీవనోపాధులను సృష్టించడంలో, సుస్థిర సరఫరా చైన్ బలోపేతం చేయడంలో అపారమైన అవకాశాలను కలిగి ఉందన్నారు. సెర్ప్ తో భాగస్వామ్యంగా తాము వెదురు తోటల ఏర్పాటులో, విలువ గొలుసు కార్యకలాపాల్లో ఒక లక్ష మంది మహిళలను భాగస్వాములు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తక్షణ కాలంలో ఈ కార్యక్రమం ఆదాయ అవకాశాలను సృష్టించి స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తుందని చెప్పారు. దీర్ఘకాలంలో గ్రామీణ వ్యాపారాలు, సుస్థిర ఉత్పత్తి, సమగ్ర అభివృద్ధికి మద్దతు ఇచ్చే బలమైన వెదురు ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో ఇది సహాయపడుతుందని." ఆయన చెప్పారు. బేంబూ విలువను బలోపేతం చేసే విస్తృత లక్ష్యంతో ఇండస్ట్రీ ఫౌండేషన్, సెర్ప్ నవంబర్ 2024లో ఐదేళ్ల అవగాహన ఒప్పందం (ఎంవోయు)పై సంతకం చేశాయని,ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ,ఎస్ఈఆర్పీ,ఎన్.ఆర్. ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో జరిగిందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా బాంబూ తోటల కార్యకలాపాల్లో ఒక లక్ష మంది మహిళలను భాగస్వామ్యం చేయడం, గ్రామీణ మహిళలకు బేంబూ ఆధారిత జీవనోపాధి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్నారని, ఈ కార్యక్రమం ఇండస్ట్రీ ఫౌండేషన్ లక్ష్యమైన పెద్ద స్థాయిలో జీవనోపాధి అవకాశాలను సృష్టించడం, పునరుత్పత్తి చెందే, ప్రకృతి ఆధారిత విలువ గొలుసులను ప్రోత్సహించడం అనే దృక్పథానికి అనుగుణంగా ఉందన్నారు. తోటల అభివృద్ధి, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలు, మార్కెట్ అనుసంధానాలను సమన్వయం చేస్తూ, సమాజానికి, పర్యావరణానికి ప్రయోజనం చేకూర్చే స్థిరమైన బేంబూ పర్యావరణ వ్యవస్థను నిర్మించడం ఈ భాగస్వామ్యం లక్ష్యమని నేజు జార్జ్ అబ్రహం వివరించారు.

### ఎల్‌పీజీ అంశం..

# వదంతులు పట్టించుకోవద్దు

ఆయన.. పశ్చిమాసియా వివాదం మొత్తం ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థను ప్రభావితం చేసిందన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా.. దేశ ప్రయోజనాలను కాపాడతామని హామీ ఇచ్చారు. తమిళనాడు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడిన ప్రధాని మోదీ.. అవినీతి, కుటుంబ రాజకీయాలను రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా డీఎంకే ప్రభుత్వం వారిని మోసం చేసిందన్నారు. నదులన్నీ సముద్రంలో కలిసిపోయినట్లే.. రాష్ట్రంలో అవినీతి ధనమంతా ఒకే కుటుంబానికి చేరుతోందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు మారినా.. అధికారం మాత్రం ఒకే కుటుంబానికి పరిమితమవుతోందని ప్రధాని మోదీ ఆరోపించారు.

# ఏపీ ప్రజల ఆకాంక్షే 'మనమిత్ర'కు ప్రేరణ

ఆధ్వర్యంలో నిర్వహించిన వాట్సప్ సిటిజన్ ఎంగేజ్మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫోరమ్ సమావేశంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పౌరసమాజానికి మేలు కలిగే విధంగా మనమిత్ర సేవలు ఉండాలన్న మాటలు.. అధికార యంత్రాంగం ఆలోచన విధానాన్ని మార్చేశాయని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టే విషయం ఏంటంటే.. మాకు 'రియల్-టైమ్ గవర్నెన్స్' వ్యవస్థ ఉంది. సాంకేతికత అనేది కేవలం ఒక సాధనం మాత్రమే. కానీ నిజమైన మార్పు సాంస్కృతికంగా జరగాలి. దీనికి రాజకీయ సంకల్పం చాలా ముఖ్యం. వాట్సప్ సేవల ద్వారా హాల్ టిక్కెట్లు తీసుకోవడం మొదలు విద్యుత్, ఇతర బిల్లులు చెల్లించడం గొప్ప మార్పు. ఫీడ్‌బ్యాక్ సేకరించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేశాం" అని చెప్పారు.

# దుబాయ్ ఎయిర్‌పోర్టు సమీపంలో డ్రోన్ల దాడులు

రద్దీగా ఉండే అంతర్జాతీయ విమానాశ్రయాల్లో దుబాయ్ ఎయిర్‌పోర్టు ఒకటి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇక్కడి నుంచి విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

# ఎవరు ముందుకొస్తారు?

అభివృద్ధి చెందాలంటే భారీ స్థాయిలో పారిశ్రామికీకరణ జరగాలి. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు రావాలి. మార్కెట్ ధరకు భూములిస్తే కంపెనీలు అనుకూల ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉంది. ప్రభుత్వ పాలసీలతో పెట్టుబడులు పెట్టలేకపోతున్నామని ఏ కంపెనీ కోర్టుకు రాలేదు కదా? ప్రభుత్వ పాలసీని సవాల్ చేస్తూ రాజకీయ నేత కోర్టుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ సంస్థల్లో ఎక్కువ శాతం తెలుగువారే ఉన్నారు. రాష్ట్రానికి చెందిన ఐటీ నిపుణులు పలు రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. ఏపీని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పాలసీలు చేసి ఉండొచ్చు" అని హైకోర్టు పేర్కొంది.

# గతంలో రవికుమార్ దొరికితే ఏం చేశారు?

భారీగా బంగారం చోరీ జరిగిందని మంగళవారం ఓ దినపత్రికలో ప్రచురితమైన కథనం పూర్తిగా అసత్యమని తితిదే ఇప్పటికే తేల్చిచెప్పింది. వాస్తవాలను వక్రీకరించి రాశారని పేర్కొంది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. గతేడాది జనవరి 11న పరకామణిలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెంచలయ్య 100 గ్రాముల బంగారు బిస్కెట్‌ను అపహరించేందుకు యత్నించినప్పుడు తితిదే విజిలెన్స్, సెక్యూరిటీ అప్రమత్తంగా వ్యవహరించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పింది. ఈ ఘటనకు సంబంధించిన ఆధారాలను కూడా కోర్టుకు సమర్పించినట్లు తెలిపింది. ఈ ఘటనను వక్రీకరించి పరకామణిలో భారీ స్థాయిలో బంగారం దొంగతనం జరిగినట్లు, రూ.కోట్ల విలువైన బంగారం మాయమైనట్లు ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని ప్రకటనలో పేర్కొంది.

# గుడివాడ కేంద్రంగా బెట్టింగ్

తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లను మరింత సమాచారం కోసం ఫోరెన్సిక్ అనాలసిస్‌కు పంపామన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల నిర్వహణ కోసం కొడాలి నానికి పెద్దఎత్తున శివ నగదు సమకూర్చినట్లు ఆరోపణలున్నాయి. వైకాపా హయాంలో మసాలా శివతో జట్టుకట్టి.. కొడాలి నాని మరో అనుచరుడు వినోద్ బెట్టింగ్ దందాలు నడిపించాడు. పోలీసులు ఇప్పటికే వినోద్‌ను అరెస్టు చేశారు.

### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో

# జగన్ గుండెల్లో గుబులు

అవసరమని పవన్ చెప్పారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో జగన్ గుండెల్లో గుబులు పట్టుకుంది. ఐదేళ్లలో ప్రజలకు ఏమీ లేకుండా చేసిన జగన్.. ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది. నకిలీ మద్యంతో జగన్ మహిళల తాళిబొట్లు తెంపారు. ఆయన ప్రెస్ మీట్ పెట్టుకోవచ్చు కానీ.. ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దు. తల్లికి వందనం, ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ పథకాలతో మహిళలకు కూటమి ప్రభుత్వం అగ్రస్థానం కల్పించింది. ఒకటో తేదీన జీతాలు, పింఛన్లు ఇస్తున్నాం. ఎన్డీయే కూటమిపై ఆరోపణలు చేయడం జగన్ మానుకోవాలి" అని కలిశెట్టి అన్నారు.

### ఆమె బాధే 'కారుణ్య మరణానికి' నాంది..

# ఎవరీ అరుణా షాన్‌బాగ్..?

వద్ద ఆమె విధులు నిర్వర్తించారు. మరో ఏడాదిలో పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. అంతలోనే నవంబర్ 27, 1973 రాత్రి సోహన్‌లాల్ అనే వార్డుబాయ్ చేతిలో పాశవిక దాడికి గురయ్యారు. ఆమెను లైంగికంగా వేధించడంతోపాటు, శునకానికి వాడే గొలుసులతో కట్టేశాడు. అత్యంత పాశవికంగా జరిపిన లైంగిక దాడిలో ఆమె మెదడుకు తీవ్ర గాయమైంది. ఈ క్రమంలోనే ఆమె కోమాలోకి వెళ్లిపోయారు. మెదడు ఎడమ భాగం పనిచేయకపోవడంతో మాట్లాడటం కష్టమైంది. అంతేకాకుండా మంచానికే పరిమితం కావడంతో.. కేఈఎం ఆసుపత్రిలోనే ఆమె కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటుచేశారు. ఆమె కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే అరుణకు కారుణ్య మరణం ప్రసాదించాలని కోరుతూ జర్నలిస్ట్ పింకీ విరాణి 2011లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అప్పుడే తొలిసారి అత్యున్నత న్యాయస్థానం 'కారుణ్య మరణం' అంశంపై సుదీర్ఘంగా విచారణ జరిపింది. అనంతరం దీన్ని చట్టబద్ధంగా గుర్తిస్తూ పలు మార్గదర్శకాలు రూపొందించింది.

**అరుణకు దక్కని కారుణ్య మరణం..**

కారుణ్య మరణం కోరే వ్యక్తికి నేరుగా ప్రాణం పోయేవిధంగా సూది మందులు, ఔషధాలు ఇవ్వకుండా.. చికిత్సను నిలిపివేసి సహజ మరణం ప్రసాదించేలా కోర్టు నిబంధనలు రూపొందించింది. అయితే, ఇందుకు బాధిత వ్యక్తి తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి లేదా దగ్గరి బంధువుల అనుమతి తప్పనిసరి. వారెవరూ లేనిపక్షంలో 'నెక్ట్స్ ఫ్రెండ్' అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అరుణా షాన్‌బాగ్ కేసులో జర్నలిస్ట్ పింకీ విరాణిని 'నెక్ట్స్ ఫ్రెండ్'గా గుర్తించేందుకు కోర్టు నిరాకరించింది. ఆ జాబితాలో అరుణ బాగోగులు చూసుకుంటున్న ఆసుపత్రి సిబ్బందిని చేర్చింది. అయితే, ఆమెకు చికిత్స నిలిపివేసేందుకు ఆసుపత్రి సిబ్బంది అంగీకరించలేదు. దీంతో విరాణి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. కాగా.. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు అలాగే జీవచ్ఛవంలా గడిపిన అరుణా షాన్‌బాగ్.. 2015లో న్యుమోనియాతో కన్నుమూసింది. ఆ తర్వాత 2018లో సుప్రీంకోర్టులో మరోసారి ఈ అంశంపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా 'గౌరవప్రదంగా మరణించడం' అనేది ప్రాథమిక హక్కుగా గుర్తించిన అత్యున్నత న్యాయస్థానం.. కారుణ్య మరణాన్ని అధికారికంగా చట్టబద్ధం చేసింది. నాడు రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే నేడు 'హరీశ్ రాణా' కేసులో సుప్రీం తీర్పు వెలువరించింది.

### లోక్‌సభ స్పీకర్‌పై

# వీగిన అవిశ్వాసం

సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అనంతరం సభ గురువారానికి వాయిదా పడింది.

**స్పీకర్ విధేయతను అనుమానించడం దురదృష్టకరం: అమిత్ షా**

"స్పీకర్ అంకితభావాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షాలు నిబంధనలు ఉల్లంఘిస్తేనే స్పీకర్ రంగంలోకి దిగారు. పార్లమెంటు నిబంధనలు నెహ్రూ హయాంలోనే రూపొందించారు. కాంగ్రెస్ రూపొందించిన నిబంధనలపై చర్చకు సిద్ధం. పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరిస్తారు. లోక్‌సభ నిబంధనల ప్రకారం స్పీకర్‌దే తుది నిర్ణయం. భారత ప్రజాస్వామ్యాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. స్పీకర్ ఉద్దేశాలను ఎవరూ తప్పు పట్టాల్సిన అవసరంలేదు. స్పీకర్ విధేయతను అనుమానించడం దురదృష్టకరం. స్పీకర్ స్థానం దిశగా ప్రతిపక్షసభ్యులు పేపర్లు విసిరారు. అందరూ లోక్‌సభ నిబంధనలు పాటించాలి. సభలో ఎలా మాట్లాడాలో థరూర్ నేర్పించాలి. కాంగ్రెస్ నేతలకు థరూర్ ఎందుకు హిత బోధ చేయరు? కాంగ్రెస్ నిబంధనలు పార్లమెంటును నడపజాలవు. తప్పులు సరిదిద్దుకొనేందుకు ప్రతిపక్షాలకు అవకాశం వచ్చింది" అని అమిత్ షా అన్నారు.

### డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు..

# విచారణకు లక్ష్మీదుర్గ హాజరు కావాలి : హైకోర్టు

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరు కావాలని చెప్పింది. లక్ష్మీదుర్గకు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. 2022 మే 19న రాత్రి.. తమ దగ్గర పనిచేసి మానేసిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య సమయంలో భర్త అనంతబాబుతో (ఏ1) కలసి లక్ష్మీదుర్గ పాల్గొన్నట్లు సిట్ విచారణలో నిగ్గుతేలింది. దీంతో లక్ష్మీదుర్గను ఏ2గా చేర్చి ఇటీవల కోర్టులో అదనపు ఛార్జిషీట్ వేసింది. హత్యకేసులో ఆమె పాత్రను రుజువు చేసేలా బలమైన ఆధారాలను రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు ముందుంచడంతో న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేశారు.

### నేను ఎప్పుడు అనుకుంటే

# అప్పుడే యుద్ధం ముగుస్తుంది

కొనసాగుతోంది. ఒకటి, రెండు మినహా.. అక్కడ పెద్దగా లక్ష్యాలేమి మిగల్లేదు. అమెరికా సేనలు ఊహించిన దానికన్నా ఎక్కువ విధ్వంసం సృష్టించాయి. మా ప్రణాళిక కన్నా చాలా ముందున్నాం. ఆరు వారాల్లో సృష్టిస్తామనుకున్న విధ్వంసాన్ని ముందుగానే చేశాం" అని ట్రంప్ పేర్కొన్నారు.

### యుద్ధం ఎఫెక్ట్.. చమురు రిజర్వులను

# విడుదల చేయనున్న జపాన్

అనిశ్చితుల వేళ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించేందుకు తమ వద్ద ఉన్న చమురు నిల్వల్లో కొంత భాగాన్ని విడుదల చేయాలని నిర్ణయించినట్లు జపాన్ ప్రధాని సనాయె తకాయిచి వెల్లడించారు. టోక్యోలో మాట్లాడిన ఆమె.. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్న రిజర్వులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన లభ్యత పెరిగి, ధరల స్థిరీకరణకు దోహదం చేస్తుందన్నారు. ఇంధన సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతున్న వేళ జీ7 దేశాల ఆర్థిక మంత్రులు ఇటీవల ఆన్‌లైన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇంధన మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలించాలని నిర్ణయించారు. చమురు నిల్వలను విడుదల చేయడంతోపాటు ప్రపంచ ఇంధన సరఫరా గొలుసుకు మద్దతుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ జీ7 దేశాలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే చమురు ధరలు కాస్త దిగివచ్చాయి. తాజాగా చర్యలు చేపట్టిన జపాన్.. చమురు నిల్వలను విడుదల చేయాలని నిర్ణయించిన తొలి జీ-7 దేశంగా నిలిచింది. మరోవైపు ముడి చమురు కోసం ప్రధానంగా దిగుమతులపైనే ఆధారపడే జపాన్.. పశ్చిమాసియా నుంచే అధికంగా దిగుమతి చేసుకుంటుంది.

# పవన్‌కు ప్రమోషన్.. పెద్ద భారమే మోపుతున్న బీజేపీ!

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై బీజేపీ అధిష్టానం పెద్ద భారం మోపనుందనే ప్రచారం ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేనాని పవన్ రాజకీయంగా తీవ్ర ప్రభావం చూపుతున్నారని బీజేపీ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు. జనసేనాని సినీ గ్లామర్ తోపాటు రాజకీయంగా ఆయన చూపుతున్న దూకుడును వాడుకోవాలని ఓ నిర్ణయానికి వచ్చిన బీజేపీ అగ్ర నాయకత్వం ఎన్డీఏలో పవన్ కు కీలక బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనకి వచ్చారని అంటున్నారు. ప్రధానంగా దక్షిణ భారత్ లో ఎన్డీఏ పార్టీల బలోపేతానికి పవన్ ను వాడుకోవాలని బీజేపీ భావిస్తోందని చెబుతున్నారు. రాజకీయంగా పవన్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని భావిస్తున్న బీజేపీ అగ్రనాయకత్వం ఎన్డీఏలో పవన్ కు కీలక పదవి, బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించిందని అంటున్నారు. ఇప్పటివరకు లేని పదవిని పవన్ కోసమే క్రియేట్ చేయాలనే ఆలోచన చేస్తోందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును జాతీయ రాజకీయాలకు తీసుకువెళతారన్న ప్రచారం జరుగుతున్న ఈ పరిస్థితుల్లో పవన్ ను కూడా దక్షిణ భారత్ స్థాయిలో వాడుకోవాలనే ఆలోచన బీజేపీ పెద్దలు చేస్తుండటం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం జనసేనాని పవన్ జాతీయస్థాయిలో బీజేపీకి గట్టి మద్దతుదారుగా ఉన్నారు. 2014లో పార్టీ పెట్టిన నుంచి ప్రధాని మోదీతో సన్నిహిత సంబంధాలు నెరుపుతున్న పవన్.. 12 ఏళ్లుగా బీజేపీతో కలిసే పనిచేస్తున్నారు. అంతేకాకుండా బీజేపీ అజెండాకు దగ్గరగా పవన్ సిద్ధాంతాలు ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. రెండు పార్టీల మధ్య చాలా విషయాల్లో సారూప్యత ఉండటంతో పవన్ ను ప్రోత్సహిస్తూ ఆయనను దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి బీజేపీ వాడుకుంటోందని గుర్తుచేస్తున్నారు. గతంలో మహారాష్ట్రలో పవన్ తో ఎన్నికల ప్రచారం చేయించారు. ఆ తర్వాత కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో సభలు నిర్వహించి పవన్ ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలకు పవన్ ఏపీ ఉప ముఖ్యమంత్రిగా, జనసేన అధ్యక్షుడిగా మాత్రమే హాజరయ్యారు. అయితే ఈ పదవులకు మించిన హోదాతో పవన్ ను గౌరవించాలని, ఆయన ప్రతిష్ఠ పెంచాలని బీజేపీ అగ్ర నాయకత్వం భావిస్తోందని చెబుతున్నారు. ఎన్డీఏలో ఉప కన్వీనర్ గా నియమించి, దక్షిణ భారత్ బాధ్యతలు పూర్తిగా పవన్ కు అప్పగించాలనే ప్రతిపాదనను సీరియస్ గా పరిణిస్తున్నారని గట్టిగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం పవన్ విషయంలో సానుకూల దృక్పథంతో ఉన్నారన్న ప్రచారం నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రికి కీలక బాధ్యతలు



అప్పగించనున్నారనే ప్రచారం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో పవన్ పదవిపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకునే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. ఇప్పటివరకు పవన్ కు పదవి ఇవ్వకపోయినా దక్షిణ్ భారత్ లో ప్రధాన రాజకీయ వ్యూహాల అమలుకు ఆయనను అస్త్రంగా వాడుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. తాజాగా తమిళనాడులో టీవీకే అధిపతి విజయ్ ను ఎన్డీఏ కూటమిలోకి తెచ్చే బాధ్యతను పవన్ కే అప్పగించారని అంటున్నారు. ఈ విషయంలో పవన్ కొంతవరకు సానుకూల ఫలితం కూడా సాధించారని అంటున్నారు. అందుకే విజయ్ ఎన్డీఏలో చేరికను తీవ్రంగా వ్యతిరేకించిన తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నాగేంద్రన్ ఒక్క రోజులోనే తన స్వరం మార్చుకున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. చాప కింద నీరులా పవన్ రాజకీయ వ్యూహాలు అమలు చేస్తుండటం వల్ల బీజేపీ అగ్ర నాయకత్వం ఆయన విషయంలో హ్యాపీగా ఉందని, పవన్ కు ఏ పని అప్పగించినా సమర్థంగా పూర్తి చేస్తారన్న నమ్మకం పెట్టుకుందని అంటున్నారు.

### పశ్చిమాసియా ఉద్రిక్తతలు..

# కాంగ్రెస్ రీల్స్ కూడా చేస్తుందేమో : మోదీ ఆగ్రహం

**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ప్రధాని మోదీ మండిపడ్డారు. ఆ దేశాల్లోని ప్రవాస భారతీయుల పరిస్థితి మరింత దిగజారేలా రెచ్చగొట్టే, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేరళ పర్యటనలో భాగంగా బుధవారం ఎర్నాకుళంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మనం ఆందోళన చెందడం సహజమే. అక్కడ లక్షలాది మంది మన భారతీయులు పనిచేస్తున్నారు. కానీ ఇక్కడ అధికారంలో ఉన్నది భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వమని మీరు గుర్తుంచుకోవాలి. మనపౌరులు విదేశాల్లో చిక్కుకున్నప్పుడల్లా వారి క్షేమం కోసం వనరులన్నీ ఉపయోగిస్తుంటాం. ఎప్పుడూ మన పౌరుల్ని ఒంటరిగా వదిలేయలేదు. ప్రస్తుత సంక్షోభంలో కూడా అవసరమైన సహాయం అందేలా చూస్తున్నాం. గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు అక్కడి మనపౌరులకు 24 గంటలు అందుబాటులో ఉంటున్నాయి. పశ్చిమాసియాలోని మన మిత్రదేశాలు భారతీయులను జాగ్రత్తగా చూసుకుంటున్నాయి. ఈ సంక్షోభ సమయంలో కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించడం దురదృష్టకరం. ఆందోళనలు రేకెత్తించేలా హస్తంపార్టీ ఉద్దేశపూర్వకంగానే ప్రకటనలు చేస్తోంది. ఈ ప్రచారం కోసం వారు రీల్స్ కూడా చేస్తారేమో" అని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించేందుకు, మేకిన్ ఇండియాను బలోపేతం చేసేందుకు పెట్రోలియం రంగాన్ని విస్తరించడం ఎంతో కీలకమని మోదీ అన్నారు. ఆ లక్ష్యంతోనే కొచ్చి రిఫైనరీ వద్ద పాలీప్రొపిలీన్ యూనిట్‌కు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. ఈ గల్ఫ్ వార్ స్వావలంబన ఆవశ్యకతను మరోసారి నొక్కి చెప్పిందన్నారు.

# ఎడిటర్ వాయిస్

## ఏపీలో 'ఇంద్రధనస్సు'

### విశేషాలు ఇవే!

ఏపీలో ఇంద్ర ధనస్సు.. అంటే ప్రకృతి పరంగా ఆకాశంలో ఏర్పడే ఇంద్ర ధనస్సుకాదు.. ప్రభుత్వ పరంగా పేదలను ఆదుకునేందుకు తీసుకువచ్చిన కీలక పథకం. దీని కి సీఎం చంద్రబాబు వినూత్నంగా ఉండాలన్న ఉద్దేశంతో 'ఇంద్రధనస్సు'గా పేరు పెట్టారు. ఈ కార్యక్రమం కింద.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు.. ఎంపిక చేసిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తారు.

తాజాగా జరుగుతున్న 6వ కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు స్వయంగా ఈ పథకాన్ని ప్రకటించారు. గత కొన్నాళ్లుగా దివ్యాంగుల నుంచి వస్తున్న అభ్యర్థన మేరకు.. ఈ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. వాస్తవానికి ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంది. దివ్యాంగు లైన మహిళలు ఈ సేవలు పొందుతున్నారు. అయితే..పురుషల సమస్య ప్రభుత్వానికి విన్నవించారు. ఈ క్రమంలో దివ్యాంగులైన వారు ఎవరైనా.. ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు.

ఈ క్రమంలోనే వినూత్నంగా ఉండే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి.. ఇంద్రధనస్సు అని పేరు నిర్ధారించినట్టు.. సీఎం చంద్రబాబు ప్రకటించారు. రాష్టంలో ఎంపిక చేసిన బస్సుల్లో దివ్యాంగులు. ఉచితంగా ఎక్కడ నుంచి ఎక్కడికైనా.. తమ ఆధార్ కార్డును చూపించి ప్రయాణించవచ్చని.. తెలిపారు. దీనికి సదరం సర్టిఫికెట్ కూడా ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 1.5 కోట్ల మంది మహిళలు స్త్రీశక్తి పేరిట అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సులను వినియోగించుకుంటున్నారని తెలిపారు.

వీరితోపాటు.. విద్యార్థులు, ఇప్పుడు దివ్యాంగులకు కూడా ఉచిత ఆర్టీసీ సేవలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. దివ్యాంగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలోనూ.. వారిని విదేశాలకు పంపించి .. చదివించడంలోనూ టీడీపీ కూటమి ప్రభుత్వం ముందుందని తెలిపారు. వృత్తులను కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ట్రైసైకిళ్లతోపాటు.. ట్రైస్కూటీలను కూడా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. దివ్యాంగులకు అండగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## దోమల కాయిల్‌తో ఇంట్లో అగ్నిప్రమాదం



### భార్యాభర్తలు, కుమార్తె మృతి

**చెన్నై (మామల్లపురం), విశ్వం వాయిస్ న్యూస్ :** దోమల కాయిల్ వల్ల ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించి భార్యాభర్తలు, వారి రెండున్నరేళ్ల కుమార్తె మృతిచెందిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చెంగల్పట్టు జిల్లా గూడువాంజేరి సమీపం కన్నివాక్కం ప్రాంతానికి చెందిన పార్తిబన్(33), జయచిత్ర(29) దంపతులు. వీరికి రెండున్నరేళ్ల కుమార్తె జయశ్రీ ఉంది. వీరు సోమవారం రాత్రి ఇంట్లో దోమల కాయిల్ వెలిగించి పడుకోగా.. అర్ధరాత్రి కాయిల్ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న దుస్తులపై పడటంతో మంటలు చెలరేగాయి. క్రమంగా మంటలు, పొగ ఇళ్లంతా వ్యాపించాయి. గాఢ నిద్రలో ఉన్న ముగ్గురు ఊపిరాడక మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలార్పి కాలిపోయిన ముగ్గురి మృతదేహాలను తీశారు.

## గుడివాడ కేంద్రంగా బెట్టింగ్..

### కొడాలి నాని అనుచరుడు సహా ఐదుగురి అరెస్టు




**గుడివాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా గుడివాడలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు మసాలా శివతో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. బెట్టింగ్ రాయుళ్ల నుంచి రూ.1.05 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టిడ్కో కాలనీ ఫ్లాట్లలో మసాల శివ, అతని అనుచరులు యాప్‌లలో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ బెట్టింగ్‌కు పాల్పడ్డారు. మసాల శివ ఫోన్‌లో పలువురు పోలీసు అధికారుల వ్యక్తిగత, వైకాపా ముఖ్య నేతల నెంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించి వాట్సప్ చాటింగ్, ఫోన్ స్క్రీన్ షాట్లను గుర్తించామని గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు తెలిపారు. బెట్టింగ్ నిర్వాహకుడు మసాలా శివ, అతనికి సహకరిస్తున్న భాను ప్రసాద్, కనక మహేశ్, అజయ్ బాబు, వంశీ కిరణ్‌లను అరెస్టు చేశామన్నారు. మరో 17 మంది బుకీలు, బెట్టింగ్‌లలో భాగస్వామ్యులైన మరో 92 మందిని గుర్తించామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లను మరింత సమాచారం కోసం ఫోరెన్సిక్ అనాలసిస్‌కు పంపామన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల నిర్వహణ కోసం కొడాలి నానికి పెద్దఎత్తున శివ నగదు సమకూర్చినట్లు ఆరోపణలున్నాయి. వైకాపా హయాంలో మసాలా శివతో జట్టుకట్టి.. కొడాలి నాని మరో అనుచరుడు వినోద్ బెట్టింగ్ దందాలు నడిపించాడు. పోలీసులు ఇప్పటికే వినోద్‌ను అరెస్టు చేశారు.

## హోంవర్క్ చేయలేదని డిప్లొమా విద్యార్థులపై అధ్యాపకుడి దాష్టీకం

### కేబుల్ వైరుతో కొట్టడంతో 15 మందికి తీవ్ర గాయాలు – ఓ విద్యార్థి కాళ్లపై గాయాలు



**హత్నూర, విశ్వం వాయిస్ న్యూస్ :** హోంవర్క్ చేయలేదనే కారణంతో ఓ ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు 15 మంది డిప్లొమా విద్యార్థులను ఇష్టారీతిన కొట్టడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధి తుర్కలఖానాపూర్ శివారులోని రత్నపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం సీఎస్‌సీ విద్యార్థుల తరగతి గదికి అధ్యాపకుడు శౌరెడ్డి వచ్చారు. హోంవర్క్ గురించి ప్రశ్నించగా విద్యార్థులు చేయలేదని చెప్పడంతో కోపోద్రిక్తుడయ్యారు. గది తలుపు పెట్టి కేబుల్ తీగతో ఎక్కడపడితే అక్కడ కొట్టడంతో విద్యార్థుల కాళ్లు, చేతులు, తొడలకు వాతలు తేలడంతోపాటు రక్త గాయాలయ్యాయి. బాధితుల్లో తుర్కలఖానాపూర్, రొయ్యపల్లి, ఇంద్రేశం, జహీరాబాద్‌కు చెందిన వారు ఉండగా.. అందులో కొందరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అధ్యాపకుడిని సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## అప్పుల బాధతో నేత కార్మికుడి ఆత్మహత్య



**రామన్నపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అప్పుల బాధతో ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై డి.నాగరాజు తెలిపిన ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన మిర్యాల బాలరాజు(39) చేనేత వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చేనేత పనుల కోసం ఐదేళ్ల క్రితం భువనగిరిలో ఓ ప్రైవేటు సంస్థలో రూ.3.50 లక్షలు రుణం తీసుకున్నారు. దీనికి ప్రతినెలా ఈఎంఐ చెల్లిస్తున్నారు. రెండు నెలలుగా పని లేకపోవడంతో ఈఎంఐలు చెల్లించడం లేదు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అతని భార్య అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## లగ్జరీ కారుతో ర్యాష్ డ్రైవింగ్..

### విదేశీయురాలి మృతి

**విశ్వం వాయిస్ న్యూస్ :** పంజాబ్‌లోని జిరాక్‌పుర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లగ్జరీ కారు వేగంగా వచ్చి.. ఓ విదేశీ మహిళను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆమె 14 అడుగుల ఎత్తుకు ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో ఆమె ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కియేకు చెందిన మాల్డోవా తన స్నేహితుడితో కలిసి ప్రైవేటు ఆస్పత్రిలో ఉన్న ఒకరిని చూసేందుకు వచ్చారు. ఆస్పత్రి నుంచి తిరిగి వెళ్తూ.. రోడ్డు దాటుతుండగా కారు వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో ఆమె 14 అడుగుల ఎత్తుకు ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో ఆమె స్నేహితుడు అభిషేక్ గాయపడ్డారు. గర్భిణిగా ఉన్న తన భార్యను చూసేందుకు మాల్డోవా ఆస్పత్రికి వచ్చినట్లు అభిషేక్ పేర్కొన్నారు. ఇక, ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే, సమాచారం ఇచ్చిన గంట తర్వాత పోలీసులు అక్కడికి వచ్చారని వారిలో కొందరు ఆరోపించారు. విదేశీయురాలి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టానికి తరలించారు. ఆ కారు నడిపిన వ్యక్తిని గుర్తించేందుకు అక్కడి సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు. మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు.

## 'పట్టణ ప్రణాళిక'లో అవినీతి కట్టలు

### రాష్ట్రవ్యాప్తంగా 13 నగరాల్లో ఏసీబీ దాడులు- పలుచోట్ల నగదు పట్టివేత, అక్రమాల గుర్తింపు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని నగరపాలక సంస్థల పరిధిలో భవన నిర్మాణ అనుమతుల జారీ, అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ (బీపీఎస్), అనుమతులు తీసుకోని లేఔట్ల క్రమబద్ధీకరణల్లో (ఎల్‌పీఎస్) పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఏసీబీ తనిఖీల్లో వెల్లడైంది. ఖాళీ భూముల పన్ను రిజిస్టర్లు సహా ఇతర ముఖ్యమైన రిజిస్టర్లేవీ నిర్వహించట్లేదని తేలింది. చాలా భవనాలకు సంబంధించి అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నట్లు బయటపడింది. ఉద్దేశపూర్వకంగా వాటిపై ఎలాంటి నిర్ణయాలూ తీసుకోకుండా పెండింగ్‌లో పెడుతున్నట్లు వెలుగుచూసింది. రాష్ట్రవ్యాప్తంగా 17 నగరపాలక సంస్థలు ఉండగా, 13 కార్పొరేషన్లలోని పట్టణ ప్రణాళిక విభాగాలపై ఏసీబీ బృందాలు మంగళవారం మెరుపుదాడులు చేశాయి. ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9.30 వరకు ఏకకాలంలో ఈ సోదాలు నిర్వహించారు. బుధవారమూ తనిఖీలు కొనసాగనున్నాయి.

ఉద్యోగుల అక్రమాలు బట్టబయలు

ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఏసీబీ బృందాలు.. తొలుత ఆయా నగరపాలక సంస్థల పరిధిలోని పట్టణ ప్రణాళిక విభాగానికి వెళ్లి అధికారులు, సిబ్బంది వద్దనున్న మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాయి. వారిని బయటకు కదలనీయకుండా తనిఖీలు చేపట్టాయి. సోదాలు చేసిన ప్రతిచోటా ఉద్యోగుల వద్ద లెక్కల్లో చూపని నగదు పట్టుబడింది. ఏసీబీ బృందాలు తనిఖీలకు వస్తున్న విషయం తెలుసుకుని ఒంగోలులోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారి రూ.7 వేల నగదును కిటికీల్లోంచి బయటకు విసిరేశారు. తిరుపతి పట్టణ ప్రణాళిక విభాగం ఉద్యోగులందరి వద్దా లెక్కల్లో చూపని నగదు లభించింది. విశాఖలోనూ ఇదే పరిస్థితి. 'లెక్కల్లో చూపని డబ్బు ఎక్కడిది? ఆ సొత్తు ఎవరి నుంచి తీసుకున్నారు?' అనే కోణంలో ఏసీబీ అధికారులు సిబ్బందిని విచారిస్తున్నారు. వివిధ పనులపై టౌన్‌ప్లానింగ్ కార్యాలయాలకు వచ్చిన పౌరులతోనూ ఏసీబీ బృందాలు మాట్లాడాయి. అనుమతుల కోసం వారు ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నారు? అది ఎన్ని రోజులుగా పెండింగ్‌లో ఉంది? సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారా? అని ప్రశ్నించి వివరాలు రాబట్టారు. అనుమతులు ఇవ్వకుండా లంచం కోసం తమను పదేపదే తిప్పిస్తున్నారంటూ పలువురు దరఖాస్తుదారులు చెప్పగా, వారి వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. పెండింగ్‌లో ఉన్నవి, గతంలో అనుమతులిచ్చిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలు సేకరించారు. అవి నిబంధనల ప్రకారమే జరిగాయా, లేదా అని పరిశీలించారు.

**తనిఖీలు చేసింది ఎక్కడంటే..?**

అనంతపురం, కడప, తిరుపతి, కర్నూలు, గుంటూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, ఏలూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మహా నగరపాలక సంస్థలోని పెందుర్తి, గాజువాక, మధురవాడ జోనల్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. చిత్తూరు, కాకినాడ, మచిలీపట్నం, మంగళగిరి మినహా మిగతా అన్ని కార్పొరేషన్లలోనూ సోదాలు చేశారు.

## వరల్డ్ గోల్డ్ క్యాపిటల్ అని ఏ నగరాన్ని అంటారో తెలుసా..?

### భూమిపై సగం బంగారం ఇక్కడి నుంచే!

బంగారం ఎల్లప్పుడూ ప్రపంచంలోనే అత్యంత విలువైన లోహం. సామ్రాజ్యాలను నిర్మిస్తుంది. ఆర్థిక వ్యవస్థలను నిలబెడుతుంది. ఇక, మన భారతదేశంలో బంగారాన్ని కుటుంబ వారసత్వ సంపదలాగా భద్రపరుస్తారు. కానీ, ప్రపంచంలోనే బంగారు రాజధాని ఏదో మీకు తెలుసా? అంటే దాదాపుగా అందరూ కర్ణాటకలోని కోలార్ అనుకుంటారు.. కానీ, అది వాస్తవం కాదు...మరీ గోల్డ్ క్యాపిటల్ సిటీగా పిలిచే ఆ నగరం ఏది..? ఎక్కడ ఉందో ఇప్పుడు తెలుసుకుందాం... ప్రపంచంలో బంగారం అంటే చాలా మందికి ముందుగా గుర్తొచ్చేది భారతదేశంలోని కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్. కానీ, గోల్డ్ క్యాపిటల్ సిటీ అంటే.. కర్ణాటక కాదు.. ఈ భూమిపై సగం బంగారం ఉత్పత్తి చేసే నగరం మరొకటి ఉంది. అదే ప్రపంచ బంగారు రాజధాని..ఇక్కడే ప్రపంచంలోని బంగారంలో దాదాపు 40శాతం ఉత్పత్తి అవుతుంది. ప్రపంచంలో అసలైన గోల్డ్ క్యాపిటల్ గా గుర్తింపు పొందిన నగరం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్. ఒకప్పుడు ఈ నగరం భూమిపై లభించిన బంగారంలో దాదాపు సగానికి సమానమైన ఉత్పత్తిని అందించినట్లు చరిత్ర చెబుతోంది. 1886లో జోహన్నెస్‌బర్గ్ ప్రాంతంలోని విట్‌వాటర్‌స్రాండ్ ప్రాంతంలో భారీ బంగారు నిల్వలు కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ సమయంలో ప్రపంచం నలుమూలల నుంచి వేలాది మంది ఇక్కడికి వచ్చి బంగారం తవ్వకాలలో పాల్గొన్నారు. ఈ సంఘటనతో జోహన్నెస్‌బర్గ్ చిన్న పట్టణం నుంచి వేగంగా అభివృద్ధి చెంది పెద్ద నగరంగా మారింది. విట్‌వాటర్‌స్రాండ్ బంగారు గనులు ప్రపంచంలోనే అత్యంత సమృద్ధిగా ఉన్న గనులుగా గుర్తింపు పొందాయి. కొన్ని అంచనాల ప్రకారం, భూమిపై ఇప్పటివరకు తవ్విన మొత్తం బంగారంలో సుమారు 40 నుంచి 50 శాతం వరకు ఈ ప్రాంతం నుంచే లభించిందని చెబుతారు. అందుకే జోహన్నెస్‌బర్గ్‌ను సిటీ ఆఫ్ గోల్డ్ లేదా వరల్డ్ గోల్డ్ క్యాపిటల్ అని కూడా పిలుస్తారు. ఈ గనుల వల్ల దక్షిణాఫ్రికా ఆర్థిక వ్యవస్థకు కూడా భారీ లాభం కలిగింది. బంగారం తవ్వకాల కారణంగా అక్కడ పరిశ్రమలు, రవాణా, వ్యాపారం వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందాయి. జోహన్నెస్‌బర్గ్ త్వరగా దేశంలోనే అతిపెద్ద నగరాలలో ఒకటిగా మారింది. అయితే బంగారం తవ్వకాలతో పాటు అనేక సమస్యలు కూడా తలెత్తాయి. గనుల్లో పనిచేసే




కార్మికులు తీవ్రమైన శ్రమకు గురయ్యారు. కొన్నిచోట్ల ప్రమాదాలు కూడా జరిగాయి. అయినప్పటికీ, ఈ ప్రాంతం ప్రపంచ బంగారం చరిత్రలో ఒక కీలక స్థానం సంపాదించింది. జోహన్నెస్‌బర్గ్ అక్కడి గనులకు మాత్రమే కాకుండా దాని పచ్చదనానికి కూడా ప్రసిద్ధి చెందింది. 10 మిలియన్లకు పైగా చెట్లతో ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మానవ నిర్మిత పట్టణ అడవిని కలిగి ఉంది. భూమిపై బంగారు నిల్వలలో దాదాపు సగం ఇప్పటికీ విట్వాటర్‌స్రాండ్ బేసిన్‌లో లోతుల్లో దాగి ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జోహన్నెస్‌బర్గ్‌లో పాత గనుల్లో చాలావరకు మూసివేయబడినా, ఈ నగరం ఇప్పటికీ ప్రపంచ బంగారం చరిత్రకు ప్రతీకగా నిలుస్తోంది. బంగారం కోసం ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల కథలు, గనుల చరిత్ర ఈ నగరాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి.

## సామాన్యులకు బ్యాడ్ న్యూస్..

### వంటనూనెపై వార్ ఎఫెక్ట్.. భారీగా పెరగనున్న ధరలు!




ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టు మిడిల్ ఈస్ట్ యుద్ధం భారత్‌ను కాస్త బెంబేలెత్తిస్తోంది. మిడిల్ ఈస్ట్ యుద్ధ ప్రభావం ముడిచమురు, ఎల్‌పీజీ, ఎల్‌ఎన్‌జీ సరఫరా మీదే కాదు.. కుకింగ్ ఆయిల్‌పైనా గట్టిగానే పడింది. సోయా, సన్‌ఫ్లవర్, పామాయిల్ దిగుమతులు తగ్గిపోవడంతో ఆయిల్ రేట్స్‌కి ఒక్కసారిగా రెక్కలొచ్చాయ్. డిమాండ్‌కి తగ్గ సరఫరా లేకపోవడంతో ఆయిల్ వాడకం పొదుపుగా లేకపోతే వంటగది బడ్జెట్ అదుపు తప్పడం ఖాయంగా కనిపిస్తోంది. లీటర్ పామాయిల్ ప్యాకెట్ రిటైల్‌గా రూ.127కి చేరింది. ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ ప్యాకెట్ రూ.174, వేరుశనగ ఆయిల్ ప్యాకెట్ రూ.180లకు అమ్ముతున్నారు. రెండు వారాల కిందట ధరలతో పోల్చుకుంటే ప్యాకెట్‌కు15-20 రూపాయలు పెరిగిపోయింది. ఇక 15 లీటర్ల ఫ్రీడమ్ ఆయిల్ డబ్బా గతంలో రూ.2450 ఉంటే ఇప్పుడు రూ.2600కు విక్రయిస్తున్నారు. యుద్ధం ఇలానే కొనసాగితే ఆయిల్ రేట్లు అందనంత దూరానికి వెళ్తాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వ్యాపారస్తులు. ప్రపంచంలోనే వంటనూనెల దిగుమతిలో భారత్ అగ్రగామిగా ఉంది. అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి సోయానూనె.. రష్యా, ఉక్రెయిన్ నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్ పెద్ద మొత్తంలో భారత్‌కు వస్తోంది. ఇండోనేషియా, థాయిలాండ్, మలేషియాల నుంచి పామాయిల్ కొంటున్నాం. అయితే సాధారణంగా అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి భారత్‌కు సముద్ర మార్గం ద్వారా వంటనూనెల దిగుమతులు రావాలంటే 6 వారాలపైనే పడుతుంది. రష్యా, ఉక్రెయిన్‌ల నుంచి నల్ల సముద్రం మీదుగా సరుకు చేరాలంటే 3-4 వారాల సమయం తీసుకుంటుంది. ఇక ఆసియా దేశాల నుంచే పామాయిల్ దిగుమతులు అవుతున్నా కూడా ఇంచుమించుగా వారం సమయం పడుతోంది. కానీ గల్ఫ్ దేశాలు అగ్ని గుండంలా మారడంతో ఈ వంటనూనెల దిగుమతి ఆలస్యమవుతున్నదిప్పుడు. అమెరికాకు అండగా ఉంటున్నారని పొరుగు దేశాలే లక్ష్యంగా ఇరాన్ బాంబుల వర్షం కురిపిస్తుండటం.. హర్మూజ్ జలసంధిని కూడా మూసేయడంతో ఆయిల్ రవాణా ఆగిపోయింది. ఫలితంగా రేట్లు హీటెక్కిస్తున్నాయి. ఇప్పటికే వంట గ్యాస్ సిలిండర్లు లేక దేశవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు మూతబడుడుతున్నాయి. కుకింగ్ ఆయిల్ దిగుమతులు కూడా తగ్గాయి. దీంతో రోజురోజుకు ఆందోళన ఎక్కువవుతోంది. మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయం వెంటాడుతోంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

గురువారం, 12 మార్చి 2026

www.viswamvoice.com




# ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

## - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో భవానీ ఛారిటబుల్ ట్రస్టు మరియు పరమేశు బయో టెక్ సంయుక్త ఆధ్వర్యంలో 6,00,000 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఒక ముఖ్య ట్రాన్స్‌పోర్ట్ హబ్ అని, దూర ప్రాంతాల నుంచి విద్య కోసం విద్యార్థులు, వైద్యం ఇతర అవసరాల నిమిత్తం ప్రజలు ఇక్కడి వస్తుంటారని అన్నారు. కాంప్లెక్స్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారు ఆ శాఖ అధికారులు, సిబ్బందిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభినందించారు. ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులు, స్థానిక ఆర్టీసీ అధికారుల సహకారంతో తాగునీటి సౌకర్యాలు మెరుగుపరుస్తున్నార న్నారు. నగరంలో సుమారు 50,00,000 లక్షలతో 8 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అల్లు రామలింగయ్య హోమియో కాలేజీ, గవర్నమెంట్ హాస్పిటల్, ఆర్టీసీ కాంప్లెక్స్ వంటి తదితర ప్రాంతాల్లో ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయన కాంప్లెక్స్‌లోని బస్సుల వద్దకు వెళ్లి ఉచిత బస్సు ప్రయాణం గురించి విద్యార్థినులు, మహిళలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి ఇబ్బందులు, ఇంకా ఏమైనా సౌకర్యాలు కల్పించాలా అనే విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** అర్ధరాత్రి వేళ అక్రమంగా తరలిస్తున్న కలపను ఇందుకూరు రేంజ్ అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా దేవీపట్నం మండలం చిన్నారి గండి సమీప ప్రాంతం నుండి అర్ధరాత్రి 2 గంటల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా మారుజాతి కలపను తరలిస్తున్న వాహనాన్ని అటవీ శాఖ సిబ్బంది పట్టుకొని ఇందుకూరు రేంజ్ అటవీ శాఖ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్టు అటవీ శాఖ అధికారి కొండలరావు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్న సిబ్బందిని రేంజ్ అధికారి అభినందించారు. ఇందుకూరు రేంజ్ పరిధి నుండి కలపను అక్రమ రవాణా చేసినా అడవులను నరికినా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# ఘనంగా సావిత్రీబాయి పూలే సంస్మరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తొలి మహిళా ఉపాధ్యాయి సావిత్రి బాయి పూలే 129వ సంస్మరణసభ పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక సీతంపేట బీసీ బాలికల వసతి గృహంలో జరిగింది. ముఖ్య అతిధిగా కాకినాడ జనరల్ హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ పితాని కోమల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసినివాళు లర్పించారు. డాక్టర్ పితాని కోమల, నయనాల కృష్ణారావు మాట్లాడుతూ నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను కుప్పకూల్చి కులరహిత సమాజ స్థాపనకు పోరాటం ప్రారంభించిన ఆద్యులు పూలే దంపతులని, అన్ని కులాల మహిళలకు విద్య నిషేదించబడిన కాలంలో తొలి బాలికల పాఠశాల స్థాపించిన యోధులని కొనియాడారు. ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయిని మాతా సావిత్రీబాయి పూలే అని, అగ్రవర్ణ స్త్రీలు కోసం బాలహత్య ప్రబంధక గృహాన్ని స్థాపించి గర్భవతులైన వితంతువులు, వారి పిల్లల సంరక్షణ బాధ్యత తీసుకున్న తొలి సాధ్వీమణి సావిత్రీబాయి పూలే అని పేర్కొన్నారు. సామాజిక స్థితిగతులపై కవితలు, పావడాలు వ్రాసిన కవయిత్రి సావిత్రీబాయి అని, వితంతువులకు గుండు గీయించాలనే ఆచారాన్ని నిరశించి, క్షురకులచేత ఉద్యమింపచేశారని, దేశంలో కర్షక, కార్మిక, ఖాదీలాంటి అనేక ఉద్యమాలకు ఆద్యులు పూలే దంపతులని అన్నారు. వారు ప్రారంభించిన ఉద్యమాలు ఇంకా సఫలీకృతం కాలేదని, వారి ఆశయసిద్ధికి, బహుజనుల సర్వతోముఖాభివృద్ధికి అంతా కృషి చేయాలని డాక్టర్ కోమల, నయనాల కృష్ణారావుకోరారు. కార్యక్రమంలో ఎం.వి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళల సమస్యలపై అర్జీలు స్వీకరించనున్న

# రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

## నేడు రాజమండ్రి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మహిళా జన్ సున్వాయ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మార్చి 12న గురువారం పర్యటనలో భాగంగా జిల్లాకు రానున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుండి 13 వరకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా 'జన్ సున్వాయ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి టి.శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్ర మంలో భాగంగా మార్చి 12, 2026న రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ మీటింగ్ హాల్‌లో ఉదయం 9:30 గంటలకు మహిళలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న గృహహింస, వరకట్న వేధింపులు, ఆస్తి వివాదాలు, కుటుంబ సమస్యలు మరియు ఇతర మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత ఆధార పత్రాలతో కలిసి సమర్పించవచ్చని తెలిపారు. సమర్పిం చబడిన అర్జీలను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరిశీలించి తగిన చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులకు సూచనలు చేయబడతాయని పేర్కొన్నారు. కాబట్టి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని మహిళలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి టి.శ్రీదేవి కోరారు.

### బిజెపి చొరవతో

# తాగునీటి అవస్థలపై అధికారుల స్పందన



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి రూరల్ ప్రాంతం స్థానిక కొంతమూరు పంచాయతీ పరిధిలోని త్రాగునీటి సమస్యపై బిజెపి జనతా వారధి కార్యక్రమం ద్వారా ప్రజల ఇబ్బందులను సోమవారం పీజిఆర్ఎస్ లో అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. దీనిపై స్పందించిన జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తో కలిసి బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చేయడం జరిగింది. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్న అధికారులు బిజెపి ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనతా వారధి మాధ్యమంగా సుదీర్ఘ కాలంగా సాగుతున్న నీటి అవస్థలు తమ దృష్టికి వచ్చాయని వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులు అధ్యయనం చేయడం కోసం పర్యటన చేయడం జరిగిందని తెలియజేశారు. పంచాయతీ ఇన్చార్జి అధికారిగా ఉన్న రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ తో కూడా సంప్రదించి తగు చర్యలు చేపడతామని, వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామని స్థానికులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు విశాకోటి దుర్గారావు, చిట్టెమ్మ, గణేష్, భువనేశ్వరి, జనతా వారధి కో కన్వీనర్ యానాపు ఏసు అధికారులతో కలిసి పర్యటించడం జరిగింది.

# మన మహిళ - మన ఆత్మగౌరవం..

## - పారిశుధ్య కార్మిక మహిళలను సత్కరించిన బీజేపీ ఎస్సీ మోర్చా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మన మహిళ – మన ఆత్మగౌరవం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పారిశుధ్య కార్మిక మహిళలను సత్కరించుకుందాం వారి ఆత్మ గౌరవాన్ని నింపుదాం. ఈ యొక్క కార్యక్రమశీ కేంద్ర పార్టీ పిలుపు మేరకు తూర్పుగోదావరి బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు తగరం సురేష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం గంటలకు రాజమండ్రి మున్సిపల్ ఆఫీసు నందు పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి కార్మికునికి ప్రధాని నరేంద్ర మోడీ స్వచ్ఛ భారత్ చిత్రపటం బహుకరించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు ,బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి,బీజేపీ సీనియర్ నాయకులు గుర్రాల వెంకట్ రావు, ఏఎంసి డైరెక్టర్ లక్ష్మి పన్నాల సంతోషి ,ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మట్టడి రమణ, ఎస్సీ మోర్చా జోనల్ ఇంచార్జి సుమన్ బాబు,ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాలేపు సాయి రామ్,జిల్లా ఎస్సీ మోర్చా జీఎస్ యజ్జల శ్రీను,ఉపాధ్యక్షులు మలిపూడి రవి, సీక్రెటరి సుజాత,కొల్లాపు శ్రీను ,చింతపల్లి సతీష్, పోలవరపు రాము,యజ్జల ప్రతాప్, యేసు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాజమహేంద్రి విద్యార్థులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహించిన డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలలో రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలను విద్యార్థినిలు అందించారని ప్రిన్సిపాల్ ఎం.కె.ఎస్. ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎం.కే.ఎస్. ప్రసాద్ మంచి ఫలితాలను సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపి మాట్లాడుతూ బీ.కాం. కంప్యూటర్స్ లో నూరు శాతం, బీ.కాం. జనరల్‌లో నూరు శాతం, బి.బి.ఏ.లో నూరు శాతం, బి.ఎస్సి స్టాటిస్టిక్స్‌లో నూరు శాతం, బి.ఎస్సి ఫిజిక్స్‌లో నూరు శాతం, బి.ఎస్సి మైక్రో బయాలజీ లో నూరు శాతం, బీ.ఎస్సీ మ్యాథమెటిక్స్ లో 98 శాతం, బీ.ఎస్సీ కంప్యూటర్ సైన్స్ లో 98 శాతం విద్యార్థులు పాస్ అయ్యారని ఈ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన వైస్ ప్రిన్సిపాల్ రాగు సత్యనారాయణను, అధ్యాపకులను అభినందించారు. ప్రతి సంవత్సరం యూనివర్సిటీ నిర్వహించే పరీక్షల ఫలితాలలో రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల ముందుంటుందని అలాగే ఈ సంవత్సరం కూడా మంచి ఫలితాలు సాధించడంలో ముందు వరుసలో ఉందని అన్నారు. కళాశాల డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య విద్యార్థినిలను అభినందించి మాట్లాడుతూ కళాశాలలో అధ్యాపకులు పాఠాలు చెబుతూ వారికి ఎప్పటికప్పుడు కళాశాల పరీక్షలు నిర్వహించి విద్యార్థినిలోని లోపాలను కనుగొని వాటిని సరిచేస్తూ తర్ఫీదు ఇవ్వడం వల్ల ఈ ఫలితాలు సాధించడం సాధ్యమైందని అన్నారు. కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ అధ్యాపకులు ఇచ్చిన తర్ఫీదు వల్లే ఇంత మంచి ఫలితాలు సాధించి ఘన విజయాన్ని సాధించగలిగామని అన్నారు. ప్రిన్సిపాల్, డైరెక్టర్, మేనేజ్మెంట్, అధ్యాపకులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# 15న ఛలో రావులపాలెం

## బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షిరాం జయంతి –కరపత్రం ఆవిష్కరించిన బీఎస్పీ నేతలు బహుజనులు పెద్దఎత్తున తరలిరావాలని నాయకుల పిలుపు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షిరాం 92వ జయంతి సందర్భంగా ఈనెల 15వ తేదీన ఛలో రావులపాలెం కార్యక్రమాన్ని తలపెట్టినట్లు బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, రాజమండ్రి అర్బన్ ఇంచార్జ్ జిల్లా కోశాధికారి ఇసుక పట్ల రాంబాబు, జిల్లా ఇంచార్జ్ నక్కా వెంకట రత్నరాజు చెప్పారు. రావుపాలెం బస్టాండ్ ఎదురుగా గల ఇందిరా కాలనీలోని డా బి ఆర్ అంబేద్కర్ పార్క్ దగ్గర కాన్షిరాం జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈమేరకు బీఎస్పీ రాజమండ్రి రూరల్ ఇంచార్జ్ మండపల్లి సూరిబాబు కార్యా లయంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ 15వ తేదీ ఉదయం 9గంటలకల్లా రావుల పాలెం సెంటర్‌కి బహుజనులు, కాన్షిరాం అభిమానులు తరలిరావాలన్నారు. మన జిల్లా నుంచి కనీసం 300మంది తక్కువ కాకుండా హాజరుకా వాలని ఆయన పిలుపు నిచ్చారు. ఇసుకపట్ల రాంబాబు మాట్లాడుతూ శాస్త్రవేత్తగా జీవితాన్ని ప్రారంభించిన కాన్షిరాం ఉదోగం చేస్తున్నపుడు తన స్నేహితుడు అంబేద్కర్ వర్ధంతి రోజున ఉపవాసం ఉండడాన్ని గమనించి ఉద్యోగాన్ని వదలిపెట్టి, కోట్లాదిమంది దళితుల జీవితం కోసం ఉదోగాన్ని వదిలేశారని పేర్కొన్నారు. మాయావతిని సీఎం చేసి, అధికారానికి దూరంగా ఉన్న కోట్లాదిమంది దళితుల రాజ్యాధికారాన్ని పాక్షికంగా అందించారని రాంబాబు అన్నారు. అందుకే బహుజన్ సమాజ్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి హాజరుకావా లని కోరారు. నక్కా వెంకటరత్న రాజు మాట్లాడుతూ కాన్షిరాం జయంతికి అన్ని ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. విజయవంతం చేయాలనీ ఆయన పిలుపు నిచ్చారు. రాజమండ్రి రూరల్ ఇంచార్జ మండపల్లి సూరిబాబు, రూరల్ నాయకులు కొత్తపల్లి శేఖర్ ఆవిడి సునీత, మండా సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి గౌతం, సాకిరి ధర్మరాజు, సీతానగరం బిఎస్పి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మీ అవయవదానం మరొకరికి జీవనాధారం

## సౌత్ జోన్ డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్ - రాజమండ్రి పీఎంపీల ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన ర్యాలీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకరు అవయవదానం చేయడం ద్వారా ఎనిమిది మందికి జీవనాధారం చూపించవచ్చని సౌత్ జోన్ డీఎస్పీ ఎస్ భవ్య కిషోర్ అన్నారు. బుధవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన స్థానిక సౌత్ జోన్ డీఎస్పీ ఆఫీసు నుండి అజాద్ చౌక్ మీదుగా దేవీచౌక్ వరకు అవయవదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన డీఎస్పీ ఎస్ భవ్య కిషోర్ మాట్లాడుతూ మనదేశంలో ప్రతి ఏటా వేలాదిమంది అవయవాలు సకాలంలో అందక మరణిస్తున్నారని ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత తన అవయవాలను దానం చేయడం ద్వారా ఎనిమిది మందికి కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చని అన్నారు. ఈ అవయవదానం పై అవగాహన కల్పిస్తున్న పీఎంపీలను అభినందించారు. పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ఈ ఏడాది అంతా పీఎంపీ అసోసియేషన్ ద్వారా అన్ని మండలాల్లో అవయవదానంపై అవగాహన కల్పించడం జరుగుతుందని, ఈ అవగాహన లేకపోవడం వల్ల, కొన్ని అపోహల వల్ల ప్రజలు అవయవదానానికి వెనకాడడం జరుగుతుందని కనుక ప్రతి పీఎంపీ ముందుగా మీరు అవయవదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు ప్రసాద్ బాబు, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, సుంకర శ్రీనివాస్, శైలజ, రాజ్యలక్ష్మి, హీరా, కోలా లక్ష్మీనారాయణ, ఎమ్.బాపూజీలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
గురువారం, 12 మార్చి 2026
www.viswamvoice.com





రూ. 50 వేల ఖరీదైన ఇంజెక్షన్‌తో

# లారీ డ్రైవర్‌కు ప్రాణ రక్షణ

## సకాలంలో స్పందించిన కొత్తపేట ప్రభుత్వ వైద్యులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల సేవలకు ప్రశంసలు మానవత్వాన్ని చాటుతూ కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సమయానికి స్పందించి ఓ లారీ డ్రైవర్ ప్రాణాలను కాపాడిన ఘటన స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ తీవ్ర గుండెపోటుకు గురికాగా, ప్రభుత్వం అందుబాటులో ఉంచిన ఖరీదైన ఇంజెక్షన్‌ను ఉచితంగా అందించి వైద్యులు అతనికి ప్రాణభిక్ష ఇచ్చారు.

**ఘటన వివరాలు**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అశోక్ జైస్వాల్ అనే లారీ డ్రైవర్ తన వాహనంతో రావులపాలెం వచ్చారు. అక్కడ నుండి లోడు తీసుకుని బయలుదేరవలసిన సమయంలో ఆయనకు అకస్మాత్తుగా తీవ్రమైన గుండెపోటు వచ్చింది. ఛాతీ నొప్పితో విలవిలలాడుతూ, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న అశోక్ జైస్వాల్‌ను గమనించిన స్థానికులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**సకాలంలో స్పందించిన వైద్యులు**

ఆసుపత్రిలో విధుల్లో ఉన్న డాక్టర్ నాగరాజు, డాక్టర్ పూజిత బాధితుడిని వెంటనే పరీక్షించి ఇసిజి పరీక్షలు నిర్వహించారు. అతనికి తీవ్రమైన గుండెపోటు వచ్చినట్లు గుర్తించి తక్షణమే అత్యవసర చికిత్స ప్రారంభించారు.రూ.50 వేల విలువైన ఇంజెక్షన్‌తో ప్రాణరక్షణ గుండె రక్తనాళాల్లో ఏర్పడిన రక్తగడ్డలను కరిగించేందుకు ఉపయోగించే టెంక్టాస్ అనే ఇంజెక్షన్‌ను బాధితుడికి ఇచ్చారు. సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సుమారు రూ.50 వేల వరకు ఖరీదు చేసే ఈ ఇంజెక్షన్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచిన సదుపాయం ద్వారా ఉచితంగా అందించారు. గుండెపోటు వచ్చిన తొలి గంటలో ఈ ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల రక్తనాళాల్లో ఏర్పడిన గడ్డలు కరిగి ప్రాణాలను కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**వైద్యులకు ప్రశంసలు**

సకాలంలో నిర్ణయం తీసుకుని బాధితుడికి ప్రాణరక్షణ చేసిన డాక్టర్ నాగరాజు, డాక్టర్ పూజితతో పాటు ఆసుపత్రి సిబ్బందిని స్థానికులు అభినందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇటువంటి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉండటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాధితుడు వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నట్లు తెలిపారు.

ముమ్మిడివరం బాలాజీ స్కూల్‌లో

# విద్యార్థులతో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం శ్రీ బాలాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులలో సృజనాత్మకత, సహకారం, బాధ్యతాభావాన్ని పెంపొందించేందుకు ప్రత్యేకంగా బుధవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా వివిధ రకాల ఆహార పదార్థాలతో స్టాళ్లను ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులు మరియు సహవిద్యార్థులకు విక్రయించారు. కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వివిధ రకాల పిండి వంటలను ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామరాజు ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ పి.సుజాత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంట్లో వండిన ఆహార పదార్థాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని రామరాజు తెలిపారు. పాఠశాలల్లో జరిగే ఫుడ్ ఫెస్టివల్ (ఆహార ఉత్సవం) విద్యార్థులలో సృజనాత్మకత, సాంప్రదాయ వంటకాలపై అవగాహన పెంచుతుంది. ఇందులో విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వివిధ రకాల వంటకాలు (పిండి వంటలు, సాంప్రదాయ ఆహారాలు) ప్రదర్శన చేశారు. ఇది ఆరోగ్యకరమైన ఆహారం, పౌష్టికాహారం మరియు వైవిధ్యమైన రుచుల గురించి నేర్చుకునేందుకు ఒక చక్కని వేదిక. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు తయారు చేసిన ఆహారాన్ని రుచి చూసి, వారిని అభినందించారు. బయట దొరికే జంక్ ఫుడ్ కంటే ఇంట్లో వండుకునే పౌష్టికాహారం ఆరోగ్యానికి ఎంత మంచిదో ఈ ఉత్సవం ద్వారా తెలిసింది. ఇది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఒక మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండంట్ పి.సుజాత మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలు, సమన్వయం మరియు సేవా భావం వంటి విలువలు అభివృద్ధి చెందుతయాన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామరాజు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయ వంటకాలను ప్రోత్సహించడం, పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలియజేయడం, మరియు విద్యార్థులలో వంట నైపుణ్యాలను పెంపొందించడం చేశారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం పాఠశాలలో ఆనందభరిత వాతావరణాన్ని సృష్టించింది.

# కర్తవ్య నిర్వహణలో 'శ్యాం' సుందరుడు!

**పన్నుల వసూళ్లే లక్ష్యం.. రాత్రి వేళల్లోనూ గడప గడపకూ పంచాయతీ కార్యదర్శి**
**ఆన్‌లైన్ విధానంపై అపోహలు తొలగిస్తూ వినూత్న ప్రచారం**
**మాచవరం సెక్రటరీ పనితీరుపై సర్వత్రా ప్రశంసలు.. ఇతర అధికారులకు ఆదర్శం!**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అధికారి అంటే ఏసీ గదులకే పరిమితం కాదని, ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను వింటూనే ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చవచ్చని నిరూపిస్తున్నారు రాయవరం మండలం, మాచవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎమ్. శ్యాం సుందర్. ఆర్థిక సంవత్సరం ముగింపు తరుణంలో పన్నుల వసూళ్ల భారం అధికారులపై ఉన్నప్పటికీ, దానిని ఒక భారంగా భావించకుండా.. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ఆయన సాగిస్తున్న తీరు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది.


**సమయం దాటినా.. సడలని దీక్ష!**

సాధారణంగా కార్యాలయ వేళలు ముగియగానే ఇంటికి వెళ్లే కాలంలో, రాత్రి 7 గంటలు దాటినా శ్యాం సుందర్ తన బృందంతో కలిసి వీధుల్లోనే ఉంటున్నారు. బుధవారం రాత్రి మాచవరం లోని దళిత వాడలో ఇంటి పన్నుల వసూళ్లు నిర్వహించిన ఆయన, ప్రతి ఇంటి తలుపు తట్టి మరీ పన్నుల ప్రాధాన్యతను వివరించారు. కేవలం పన్ను వసూలు చేయడమే కాకుండా, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉంది? పారిశుద్ధ్య పనులు సరిగ్గా జరుగుతున్నాయా? అని ఆరా తీస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. పన్నుల వసూళ్లు లో ఆయన చూపుతున్న చిరునవ్వు తో కూడిన చాకచక్యం ప్రజలను సైతం ఆకట్టుకుంటోంది.

**డిజిటల్ విప్లవం - అవగాహనే ఆయుధం**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆన్‌లైన్ చెల్లింపుల విధానంపై గ్రామీణ ప్రజల్లో నెలకొన్న అయోమయాన్ని ఆయన సమర్థవంతంగా తొలగిస్తున్నారు. ప్రజల ఎదుటే ఆన్‌లైన్ ద్వారా పన్నులు కట్టించి, వెంటనే డిజిటల్ రసీదులు చూపిస్తూ పారదర్శకతపై నమ్మకం కలిగిస్తున్నారు. బిల్ కలెక్టర్ ఆర్. శివ, వివోఏలు, ఎంజిఎనార్జీఎస్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ లక్ష్యం దిశగా సాగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పన్నుల వసూళ్లు మందకొడిగా సాగుతున్న తరుణంలో, మాచవరంలో ఇప్పటికే 70 శాతం వసూళ్లు పూర్తి కావడం విశేషం. బదిలీల కారణంగా కొత్తగా వచ్చిన అధికారుల పట్ల ప్రజలకు అవగాహన లేకపోయినా, శ్యాం సుందర్ స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజల మన్ననలు పొందుతున్నారు. "గ్రామం అభివృద్ధి చెందాలంటే మనవంతు బాధ్యతగా పన్నులు కట్టాలి" అని ఆయన చెబుతున్న మాటలు ప్రజల్లో మార్పు తెస్తున్నాయి. ఈ తరహా పనితీరును మిగిలిన గ్రామాల్లోని కార్యదర్శులు కూడా అలవర్చుకుంటే ప్రభుత్వ లక్ష్యాలు సులభంగా నెరవేరుతాయని గ్రామ కూటమి నాయకులు, ఉన్నతాధికారులు, పలువురు అభిప్రాయపడుతున్నారు.

## "అవినీతికి తావులేని పాలనే మా లక్ష్యం"



పారదర్శకత కోసమే ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తెచ్చింది. పాత రసీదుల పద్ధతికి అలవాటు పడిన ప్రజలకు కొత్త విధానం అర్థం కావడం లేదు. అందుకే నేరుగా వారి వద్దకు వెళ్లి వివరిస్తున్నాం. మాచవరం గ్రామాన్ని అభివృద్ధిలో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే లక్ష్యం."

**ఎం.శ్యాంసుందర్**
**(పంచాయతీ కార్యదర్శి)**

# అసత్యాల విషజీవి జగన్

## మంత్రి వాసంశెట్టి సుభాష్ ధ్వజం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** జగన్‌రెడ్డి అబద్ధాలు, మోసాలు తెలుసుకున్న ప్రజలు, వైసీపీని పాతాళంలో పాతరేసినా ఆయన తీరు లోమార్పు రావడం లేదంటూ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆక్షేపించారు. అబద్ధాలు, అసత్యాలతోకూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డి విషం కక్కుతున్నారని వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. గత అయిదేళ్ళపాలనలో దోపిడీ చేసిన బాగోతాలు బయటపడడంతో సమాధానం చెప్పే దమ్ము లేని దద్దమ్మ జగన్ అంటూ ఘాటుగా విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అప్పులు పెరిగిపోతున్నాయంటూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు జగన్ నానా యాగీ చేస్తున్నాని ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అప్పులు ఎలా, ఎందుకు, ఎవరి పాలనలో ఎంత పెరిగాయో ప్రజలకు నిజాలు తెలియవనుకోవడం జగన్ అవివేకానికి నిదర్శనమన్నారు. జగన్‌రెడ్డి అయిదు సంవత్సరాల పాలనలో రాష్ట్ర అప్పులు ఏ స్థాయికి చేరాయో అందరికీ తెలుసని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఆయన ఛిన్నాభిన్నం చేసిన ఉదంతం ఇంకా ప్రజలు మరచిపోలేదని వాసంశెట్టి సుభాష్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉచిత పథకాలు, ప్రచారం పేరుతో అప్పులు చేసి రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఆయన ఎద్దేవా చేశారు. నేడు రాష్ట్ర అప్పులు పెరిగిపోతున్నాయని సిగ్గు లేకుండా సుద్దపూస మాటలు చెబుతున్నారంటూ జగన్ పై సుభాష్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తన పాలనలో చేసిన ఆర్థిక దోపిడీ మరుగున పడేలా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై విషప్రచారం చేయడం సిగ్గు అనిపించడం లేదా? అని జగన్ రెడ్డిని మంత్రి సుభాష్ ప్రశ్నించారు. అప్పులు చెయ్యడం తప్పు కాదు. కానీ వాటిని దేని కోసం చేస్తున్నారన్నది ప్రజలందరూ గ్రహిస్తున్నారు. ప్రస్తుతం కూటమిప్రభుత్వం తీసుకునే అప్పులు పెట్టుబడులు రావడానికి, మౌలిక వసతులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనకు, ఆర్థిక వృద్ధికి అవసరమైన అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం కోసమేనన్న సంగతి ప్రజలందరికీ తెలిసినా ఏమి తెలియని రాజకీయ అజ్ఞాని జగన్ రెడ్డి అంటూ విమర్శించారు. జగన్ పాలన రాష్ట్రాన్ని అప్పుల భారంతో బలహీనపరిస్తే, కూటమి ప్రభుత్వం అప్పులను అభివృద్ధిగా మార్చే కృషి చేస్తోందని సుభాష్ తెలిపారు. పదకొండు మంది వైసీపీ ఎమ్మెల్యేల గురించి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్ కూడ జగన్ రెడ్డి సరిగా అర్థం కానట్టు ఉందని ఎద్దేవా చేశారు. పవన్ చేసింది పొగడ్త అనుకుని చంకలు బాదుకుంటున్న వైసీపి వాళ్ళను చూసే జాలివేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ప్రధాని అవుతారంటూ మీడియాలో వస్తున్న కథనాలపై జగన్ అక్కసు వెళ్ళగక్కడానికి మంత్రి సుభాష్ తీవ్రంగా ఆక్షేపించారు.జగన్ రాజకీయాల్లోకి రాకముందే దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన రాజకీయ దురంధరుడు చంద్రబాబు అన్నారు. ప్రధాన మంత్రి అవకాశాలు వచ్చినగాని రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ పదవిని త్యజించిన వ్యక్తి చంద్రబాబు అనే సంగతి జగన్ కు తెలియకపోవడం శోచనీయమన్నారు. అసలు. జగన్ సీఎంకు తక్కువ, ఎమ్మేల్యేకు ఎక్కువ అలాంటి వ్యక్తా చంద్రబాబుపై కామెంట్ చేసే హక్కు ఎక్కడదని సుభాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు అయినా దక్కుతుందనే విషయాన్ని జగన్ గ్రహిస్తే మంచిదని సుభాష్ హితవు పలికారు.

# ప్రభుత్వ నిబంధనలు పాటించాలి : ఎంఈఓ



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజోలు ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు అన్నీ కూడా ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని మండల విద్యాశాఖాధికారి నల్లి మనోహరం తెలిపారు. బుధవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సమావేశంలో అయన మాట్లాడుతూ ఆర్జెడి అదేశానుసారం 12(1)సి ప్రకారం 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించాలని ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే ప్రతి ఒక్క ప్రైవేట్ పాఠశాల సిఎఫ్ఎంఎస్ వెండర్ కోడ్ ని కలిగి ఉండాలని, విద్యార్థుల ఆన్లైన్లో హాజరు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# నూరుశాతం హౌస్ టాక్స్ వసూలు



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజోలు మండలంలో ప్రభుత్వ కార్యాలయాల హౌస్ టాక్స్ నూరు శాతం వసూలు అయ్యిందని ఎంపీడీఓ కె.వెంకటేశ్వర రావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హౌస్ టాక్స్ వసూలు కార్యక్రమం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన భుజాల మీద వేసుకుని ఎకౌంటబిలిటీ సిస్టమ్ ను పంచాయతీల్లో తీసుకురావాలన్న వారి ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలు యొక్క హౌస్ టాక్స్ ను నూరు శాతం చెల్లించామని అన్నారు. మండల పరిషత్ కార్యాలయం మరియు షాపింగ్ కాంప్లెక్స్ 2025-26 సంవత్సరం కూడా పన్నులు చెల్లించి ప్రభుత్వ అధికారులు ప్రభుత్వానికి తమ వంతు సహకారం అందించారని అన్నారు.ఈకార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో నిండు శోకంతో

# హజరత్ ఇమామ్ అలీ 1407వ వర్ధంతి



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

షియా ముస్లింల ఆరాధ్య దైవదూత, మహమ్మద్ ప్రవక్త అల్లుడు హజరత్ ఇమామ్ అలీ 1407వ వర్ధంతి వేడుకలు అమలాపురం పట్టణంలోని 12వ వార్డు ముజాఫర్ సందులో ఉన్న ఆస్థానే అబ్బాసియా పీర్ల పంజాలో బుధవారం నిండు శోకంతో, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, వృద్ధులు, పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వర్ధంతి సందర్భంగా పంజాలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన మత గురువు మహమ్మద్ హైదర్ అలీ హజరత్ ఇమామ్ అలీ మహిమను, ఆయన జీవిత విశిష్టతను భక్తులకు వివరించారు. చరిత్ర ప్రకారం క్రీ.శ. 661లో హజరత్ ఇమామ్ అలీ నమాజు (ప్రార్థన)లో నిమగ్నమై ఉన్న సమయంలో అబ్దుల్ రహ్మాన్ బిన్ ముల్జిం అనే వ్యక్తి యుద్ధ ఖడ్గంతో ఆయన తలపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. అనంతరం రంజాన్ నెల 21వ తేదీన ఆయన స్వర్గస్థులైన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఈ వర్ధంతి కార్యక్రమాన్ని షియా ముస్లింలు శోకదినంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం భక్తులు ఆస్థానే అబ్బాసియా పంజాకు చేరుకుని కఠోర ఉపవాసాలతో ప్రార్థనలు నిర్వహించి, హజరత్ ఇమామ్ అలీకి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమాన్ని మసీదు అధ్యక్షులు కర్రార్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉపవాస దీక్షను విరమించుకునే ఏర్పాట్లు చేసి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం భక్తులందరికీ భోజన సదుపాయాన్ని కూడా కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రపంచ శాంతి నెలకొనాలని, ప్రజలంతా ఆర్థికంగా, భౌతికంగా అభివృద్ధి చెందాలని, ఆరోగ్యంగా సుఖసంతోషాలతో జీవించాలని అల్లాను కోరుకున్నారు.



# భవిష్య క్యాన్సర్ నివారణకే హెచ్.పి.వి. టీకాలు..!

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్.పి.వి. టీకాల కార్యక్రమం ప్రారంభం - శంఖవరం ఆస్పత్రికి 209 డోసుల టీకాల విడుదల**
**పెదమల్లాపురం ఆస్పత్రికి 64 డోసుల విడుదల - టీకాలపై విద్యార్థి బాలికలకు, తల్లిదండ్రులకు అవగాహన**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో హెచ్.పి.వి. టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ప్రారంభించింది. దీనిలో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని పెదమల్లాపురం, శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ టీకాలు వేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ టీకాలను తొలి ప్రాధాన్యతగా 14 నుంచి 15 సంవత్సరాల బాలికలకు మాత్రమే అందులోనూ ప్రభుత్వ పాఠశాలల్లోని మాత్రమే విద్యార్థినిలకు వేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో తల్లిదండ్రుల సమక్షంలోనే అందునా అభా గుర్తింపు ఉన్న బాలికలకు మాత్రమే ఈ టీకాలను వేస్తున్నారు. టీకాలు వేసి ఆ బాలికలు అందరినీ ఆస్పత్రి వార్డుల్లో విశ్రాంతి తీసుకోమని చెప్పి ఏమైనా ప్రతికూల లక్షణాలు కనిపిస్తున్నాయాని స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పర్యవేక్షించి సురక్షితంగా ఉన్నారని వైద్యులు నిర్ధారించాకే బయటకు పంపుతున్నారు. పెదమల్లాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తొలి విడతలో 122 (డోసులు) మంది బాలికలకు ఈ టీకాలు కావాలని వైద్యులు పొలసపల్లి సందీప్ ప్రతిపాదించగా వాటిలో 64 డోసులు మాత్రమే విడుదల అయ్యాయి. మొదటి రోజు ఒక బాలికకు ఈ టీకాను వేసారు. ఇక శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తొలి విడతలో 418 (డోసులు) మంది బాలికలకు ఈ టీకాలు కావాలని ఆస్పత్రి ప్రధాన వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్ ప్రభుత్వానికి ప్రతిపాదించగా వాటిలో సగం అంటే 209 డోసులు మాత్రమే విడుదల అయ్యాయి. ఇక్కడ మండపంనకు చెందిన పోలం నాగసత్యకు మొదటి టీకాను వేసి అంతర్జాలంలో నమోదు చేశారు. ఈ సందర్భంగా శంఖవరం ఆస్పత్రిలో విద్యార్థి బాలికలు, వారి తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది బృందంతో ఏర్పాటు చేసిన సభలో ప్రధాన వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్ తొలి వక్తగా ప్రసంగించారు. నేటి బాలికలకు భవిష్యత్తు కాలంలో కొన్ని రకాల క్యాన్సర్ రోగాలు రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఇప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ హెచ్.పి.వి. టీకాలను వేస్తున్నదని వెల్లడించారు. ఈ టీకాలను వివిధ నిర్దిష్ట వయస్సు సమూహాల మహిళలకు వివిధ రకాల డోసుల్లో ఈ టీకాలను వేస్తారని వెల్లడించారు. అయితే తొలి ప్రాధాన్యతగా 14-15 సంవత్సరాల బాలికలకు మాత్రమే ప్రభుత్వం ఉచితంగా ఈ టీకాలను వేస్తోందని వెల్లడించారు. మలి విడతల్లో మిగతా వయస్సు సమూహాల మహిళలకు కూడా ఈ టీకాలను వేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ టీకా చాలా ఖరీదైనదని, చిన్న పిల్లలకైతే



రూ.8000-10,000, అదే పెద్ద వయస్సు వారికైతే రూ. 19,000- 30,000 ఉంటుంది అన్నారు. అదే ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లోనైతే ఈ టీకా ప్రారంభ ధర రూ.30,000 ఉంటుందని తెలిపారు. ద్వితీయ వైద్యులు మోహన్ సాయిరెడ్డి ఈ టీకా వేసుకోవాల్సిన ఆవశ్యకత, ఫలితంగా ఏయే రకాల క్యాన్సర్లను ఇది నివారిస్తుందనే పలు అంశాలపై సోదాహరణంగా వివరించారు. ఇక ఈ కార్యక్రమ ముఖ్య అతిథి పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ పూర్వ ప్రచార కార్యదర్శి, శంఖవరం స్థానిక నేత పర్వత సురేష్ మాట్లాడుతూ... ఈ టీకాలను పాఠశాలల్లోని విద్యార్థినిలకు వేసే విషయమై ఆ బాలికలు, వారి తల్లిదండ్రులకు బాగా అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలకు ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వచ్చి అవగాహన కల్పిస్తారని, అందుకు పాఠశాలల్లో విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులతో సమావేశ వాతావరణాన్ని కల్పించాలని విద్యాసంస్థల ప్రిన్సిపాల్సుకు సురేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు రవిశంకర్, ఆస్పత్రి సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

జన సైనికులు అందరూ

# సభ్యత్వం నమోదు చేయించుకోవాలి

**ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపు**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ రాష్ట్ర జనసేన పార్టీ విస్తృతస్థాయి సభ్యత్వ నమోదు జనసేన ఉద్యమిలో భాగంగా జన సైనికులు వీర మహిళలు ముందుకు వచ్చి సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు జనసేన ఉద్యమిలో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికీ 23 వేల పైచిలుకు సభ్యతుల మొదలు జరిగాయని అయితే ఈ నెల 14వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కొనసాగుతుందని అలాగే 16వ తేదీ జరుగు బహిరంగ సభ ఎండల వల్ల ఏ మండలానికి ఆ మండలంలో సమావేశంలో ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే రూరల్ లో మరింత వేగంగా సభ్యత్వ నమోదు జరగాలని తెలియజేశారు. ఇంచార్జిగా నరసరావుపేట ఉన్నందున గత ఏడాది 35 వేలు సభ్యత్వ నమోదు జరిగిందని ఈ సంవత్సరం 50 వేల వరకు సభ్యత్వ నమోదు జరుగుతుందని భావిస్తున్నామని అన్నారు. మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తూ సభ్యత్వ నమోదుకు ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## సాఫీగా డ్రైనేజీ పనులు

**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** తాళ్ళరేవు మండల పరిధిలోని తాళ్ళరేవు పంచాయతీ మాధవ రాయుని పేటలో చేపట్టారు. ఇటీవల చేపట్టిన డ్రైనేజీ నిర్మాణంతో శ్రీరామ నగర్ ప్రాంతం మురికి కూపంగా మారింది. డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రధాన డ్రైనేజీకి అనుసంధానంగా చిన్న డ్రైనేజీలను తాత్కాలికంగా మూసివేయడం వలన శ్రీరామ్నగర్ ప్రాంతం డ్రైనేజీ నీరు ఎటు వెళ్లేదారి లేక ఇబ్బందికరంగా ఉంది. డ్రైనేజీ పనులు ముగిసే వరకు తాత్కాలికంగా దుర్వాసన రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ పంచాయతీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. దోమలు ఎక్కువే డెంగ్యూ అంటే వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

## అపదలో ఉన్నవారికి అండగా ముదునూరి మురళీకృష్ణం రాజు

**ధర్మవరం గ్రామంలో పరామర్శలు, ఆర్థిక సహాయం**

**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో అనారోగ్యం మరియు ప్రమాదాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను పరామర్శిస్తూ ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ పార్లమెంట్ పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు మానవత్వాన్ని చాటుకున్నారు. బాధల్లో ఉన్న కుటుంబాలను స్వయంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పడంతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన రాపా నీలాబాబు అల్లుడు శివ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మురళీకృష్ణం రాజు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. శివ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం చికిత్స ఖర్చులకు ఉపశమనంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎలాంటి కష్టాలు వచ్చినా తాను అండగా ఉంటానని వారికి భరోసా కల్పించారు. అలాగే అదే గ్రామానికి చెందిన దడాల నాగభూషణం భార్య వరలక్ష్మి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారని తెలిసి వారిని కూడా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. వైద్య ఖర్చులకు తోడ్పాటుగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కూడా మాట్లాడిన ముదునూరి మురళీకృష్ణం రాజు, ప్రజల కష్టసుఖాలలో భాగస్వామిగా ఉండటం తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, యాళ్ల ఏసు, జువ్వల మసలయ్య, రాపా అన్నప్ప, దడాల అప్పారావు, సింగలూరి శేఖర్, అంబటి అప్పాజీ, కుడుముల శ్రీను, రాపా రాజేష్, యాళ్ల నాగేశ్వరరావు తదితర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కాకినాడలో ప్రమాదం అంచున పారిశ్రామిక వాడ

**ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్న జెడ్ఎం - మూడు సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం**

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి అందించే పారదర్శక పాలనలో పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కారవేదిక) ప్రధాన పాత్ర పోషిస్తుందని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం అదంతా అసత్యమేనని, దానిలో ఏ మాత్రం నిజాలు లేవనే కనిపిస్తున్నాయి. కాకినాడరూరల్ మండలం రమణయ్యపేట గ్రామంలో ఉన్న ఏపిఐఐసిలో చాలా పరిశ్రమలకు అగ్ని ప్రమాద రక్షణ చర్యలు లేవని, అనుమతులు లేని ప్లాస్టిక్ వ్యర్థాల డంప్ చేసి అక్రమ వ్యాపారం చేస్తున్నారని గత ఏడాది మార్చి 7వ తేదీన రమణయ్యపేటకు చెందిన మాజీ వార్డు మెంబర్, తెలుగదేశం నాయకులు యాదగిరి సత్యన్నారాయణ పిజిఆర్ఎస్‌లో పిర్యాదు చేయగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మొదటి సారి ఇచ్చిన పిర్యాదు అయితే ఆన్‌లైన్ చేయలేదని, దీనిపై మరో మారు పిర్యాదు చేస్తే అప్పుడు ఆన్‌లైన్ చేసారన్నారు. ఈ సమస్యపై ఇప్పటివరకు మూడుసార్లు పిర్యాదు చేసినా




ఏపిఐఐసి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యాలయం చుట్టూ కాళ్ళరిగేలా తిరగడం తప్ప ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ప్రతి పిర్యాదుకు మూడు నెలల గడువు గల నోటీసులు ఇచ్చామని చెప్పడం ఇప్పటికీ ఎడాది పూర్తియినా ఎక్కడ వేసిన గొంగలి అక్కడ ఉందన్నా చందంగా ఉందన్నారు. ఇటీవల వేట్ల పాలెంలో ఊరికి చివర బాణా సంచా ప్రమాదం జరిగితే అక్కడ పనిచేస్తున్న వారు మాత్రమే చనిపోయరని, అదే ఇక్కడ జరిగితే లెక్కలేనన్ని ప్రాణాలు పోయే ప్రమాదముందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాస్టిక్ వ్యర్థాల దంపింగ్ వ్యాపారం చేస్తుంటే ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్లాస్టిక్ ప్రమాదవసాత్తు మంటలు అంటుకుంటే ప్రమాద పరిస్థితి చెప్పలేమన్నారు. పారిశ్రామిక వాడలో 68సిక్ ఇండస్ట్రీస్ ఉన్నాయని చెప్పారని, పనిచేస్తున్న పరిశ్రమల్లో 9వాటికి అగ్ని ప్రమాద రక్షణ చర్యలు ఉండాలని, వాటిలో 2మాత్రమే ఉన్నాయని, మిగిలిన వాటికి నోటీసులు ఇచ్చామని చెప్పారే తప్ప ఇప్పటివరకు వాటికి ప్రమాద రక్షణ చర్యలు చేపట్టారో లేదో చెప్పలేదన్నారు. అంతే కాకుండా పారిశ్రామిక వాడలో అనేక అక్రమ వ్యాపారాలు జరుగుతున్నాయని, వాటిపై ఏ విధమైన తనిఖీలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

75 సంవత్సరాల నుండి

## నివాసం ఉంటున్న వారిపై దౌర్జన్యం

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సర్పవరం గ్రామంలో పినుగుల పుంతలో సుమారు 75 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న వారిపై దౌర్జన్యంగా పొక్కులేని తెచ్చి ఖాళీ చేయాలంటూ ఇబ్బందులు గురి చేస్తున్నారని బాధితులు బోనాస్ కృష్ణ అన్నయ్య బోనస్ సత్తిబాబులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో




మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా మా తాతల నుండి ఇక్కడే నివాసం ఉంటూ కాలం సాగిస్తున్నామని అయితే రౌడీ మూక బుధవారం రెండు ట్రాక్టర్లు ఒక పొక్కులు ఎంతో వచ్చి ఖాళీ చేస్తారా చేయరా అంటూ జులూమ్ ప్రదర్శించి చుట్టూ ఉన్న కంచెను తొలగించి కొట్టడానికి వచ్చారని పిడుగులు పొంతకు సంబంధించిన నాలుగు ఎకరాల 60 సెంట్లు భూమిలో పెద్దపెద్ద ఇల్లు నిర్మాణం చేసి ఎన్నో ఏళ్ల బట్టి అందరూ నివాసం ఉన్నారని కూలి పని చేసుకునే బతికే మమ్మును ఫేక్ డాక్యుమెంట్స్ తెచ్చి బెదిరిస్తున్నారు అంటూ వాపోయారు. అయితే హైకోర్టులో పిటిషన్ కూడా ఉందని అయినా సరే లెక్కచేయకుండా రౌడీలు వచ్చి ఇబ్బందులు గురి చేస్తున్నారని మాకు న్యాయం చేయాలని మీడియాకు తెలియజేశారు. ఇంటి పన్ను కరెంట్ బిల్లు కూడా ఉందని ఈ మధ్యకాలంలో తాటి గిల్లు అని పన్ను కట్టించుకోలేదన్నారు. ఇప్పుడు 125 గజాలలో రేకుల షెడ్డు కూడా వేసుకున్నామని ఇదే ఇంటిలో నివాసం ఉంటున్నామని అన్నారు.

# హెచ్.పి.వి. టీకాలు ఎందుకోసం వేయించుకోవాలంటే...?


**జిల్లాలో ప్రారంభమైన హెచ్.పి.వి. టీకాల కార్యక్రమం**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో హెచ్.పి.వి. టీకాలు వేసే కార్యక్రమం ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్నది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకూ మందు బుడ్లు అవసరమైనంత మేరకు, నిర్ధారిత సంఖ్యలో మంగళవారం రాత్రికి చేరుకున్నాయి. బుధవారం ఉదయం కాకినాడ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ హెచ్.పి.వి. టీకాలను వేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ టీకాలను తొలి ప్రాధాన్యతగా 14 నుంచి 15 సంవత్సరాల బాలికలకు మాత్రమే వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ టీకా మందులు ఎందుకో కాస్త ప్రాథమిక అవగాహన కోసం టూకీగా తెలుసుకోసం జిజ్ఞాసపరులకు ఎంతైనా అవసరం. కొన్ని రకాల హ్యూమన్ పాపిల్లోమా వైరసుల ద్వారా సంక్రమణకు వ్యతిరేకంగా పొందిన రోగ నిరోధక శక్తిని అందించడానికి ఉద్దేశించిన టీకాలే హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్.పి.వి) టీకాలు. మొదటి హెచ్.పి.వి.టీకా 2006లో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం లైసెన్స్ పొందిన ఆరు రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో మూడు బైవాలెంట్ (రెండు రకాల హెచ్.పి.వి నుండి రక్షణ కల్పిస్తాయి), రెండు క్వాడ్రివాలెంట్ (నాలుగుకి వ్యతిరేకంగా), ఇంకొకటి నాన్వాలెంట్ వ్యాక్సిన్ (తొమ్మిదికి వ్యతిరేకంగా) ఉన్నాయి. అన్నీ అద్భుతమైన భద్రతా ప్రొఫైల్‌లను కలిగి ఉన్నాయి. ఇవి అత్యంత ప్రభావ వంతమైనవి. ఇమ్యునోబ్రిడ్జింగ్ ప్రమాణాలను కలిగి ఉన్నాయి. ఈ టీకాలు 70% గర్భాశయ క్యాన్సర్, 80% ఆసన క్యాన్సర్, 60% యోని క్యాన్సర్, 40% వల్వార్ క్యాన్సర్లను నివారించ వచ్చని అంచనా వేసారు. హెచ్.పి.వి. పాజిటివ్ ఓరోఫారింజియల్ క్యాన్సర్లను నివారించడంలో 90% కంటే ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. ఇవి పురుషాంగ క్యాన్సర్ నుండి కూడా రక్షిస్తాయి. జననేంద్రియ మొటిమల (అనోజెనిటల్ మొటిమలు అని కూడా పిలుస్తారు)ను కూడా నివారిస్తాయి, క్వాడ్రివాలెంట్, నాన్వాలెంట్ టీకాలు వాస్తవంగా పూర్తి రక్షణను అందిస్తాయి. 9-14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు ఒకటి లేదా రెండు మోతాదుల షెడ్యూల్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేస్తోంది. 15-20 సంవత్సరాల వయస్సు బాలికలకు ఒకే విధంగాను, 21 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళలకు ఆరు నెలల విరామంతో రెండు మోతాదుల టీకాలు కనీసం ఐదు నుండి పది సంవత్సరాల వరకు రక్షణను అందిస్తాయి. వైద్య శాస్త్రంలోని ప్రతీ మందు వినియోగం ఫలితంగా ఎంతో దుష్ప్రభావాలు ఉంటాయి. అలాగే ఈ హెచ్.పి.వి. టీకాల వినియోగం ఫలితంగా టీకా వేసిన చోట నొప్పి, వాపు, ఎరుపు, తలనొప్పి, అలసట వంటి లక్షణాలు కనిపించొచ్చు. ఈ టీకాలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, యువిన్ పోర్టల్లోనూ అందుబాటులో ఉన్నాయి.




## తోటను కలిసిన అబ్బిరెడ్డి వీర్రాజు

**పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి**



**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** పార్టీ పదవులు పొందిన నాయకులు వైసీపీ పార్టీ పటిష్ఠత కు కృషి చేయాలని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ వైసిపి జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడి గా తనని నియమించినందుకు అబ్బిరెడ్డి వీర్రాజు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు మండపేట నియోజకవర్గం కేశవరం గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి వీర్రాజు అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ గా నియమితులైన సంగతి విదితమే. ఈ క్రమంలో బుధవారం మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసిపి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ ఇంచార్జ్ తోట త్రిమూర్తులు ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కృతజ్ఞతలు తెలియజేసారు. తోట ను దుస్సలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, మాజీ ఏ ఏం సి చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్ , నియోజకవర్గ వైసీపీ ఐటి వింగ్ అధ్యక్షులు యరమాటి వెంకన్నబాబు , వైసీపీ నాయకులు సాధనాల శివ భగవాన్ , టూపా పుల్లేశ్వరరావు , కోళ్ల శ్రీను గారు బందెల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా టెక్ కంపెనీలపై ఇరాన్ గురి

**నేటి వార్త :** అమెరికా మిత్ర దేశాల్లోని కీలక స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న అమెరికా టెక్ కంపెనీల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాలని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సైనిక చర్యల కోసం ఈ సంస్థల టెక్నాలజీని ఉపయోగిస్తున్నందున వీటిని లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ అనుబంధ వార్తా సంస్థ తస్నీం న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. “ఈ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం మౌలిక సదుపాయాలకు విస్తరిస్తున్న కొద్ది.. ఇరాన్ లక్ష్యాల పరిధి కూడా పెరుగుతోంది” అని తాజా కథనం పేర్కొంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఎన్‌విడియా, ఒరాకిల్, పాలంటిర్ వంటి టెక్ సంస్థలతోపాటు ఇజ్రాయెల్ నగరాలు, గల్ఫ్ దేశాల్లో క్లౌడ్ ఆధారిత సేవలు అందిస్తున్న కొన్ని కార్యాలయాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు సంబంధించిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలనూ లక్ష్యంగా చేసుకుంటామని.. ఇందుకోసం శత్రువులు తమకు స్వేచ్ఛ కల్పించారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రదేశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ప్రజలు ఉండవద్దని ఇరాన్ హెచ్చరించింది.



### మహిళల భద్రత కోసం

# కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది

**అన్ని రంగాల్లోనూ మహిళలు సత్తా చాటుతున్నారు - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**మిన్నంటిన సంబరాలు - సాంస్కృతిక, క్రీడా బాలికలకు, మహిళలకు సత్కారం - కల్తీ పాల మృతులకు నివాళులు**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్ని రంగంలోనూ మహిళలు సత్తా చాటుతున్నారని పలువురు వక్తలు అన్నారు. తెలుగు మహిళల ఆధ్వర్యంలో స్టేడియం రోడ్డులోని అల్యూమినియం అసోసియేషన్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నగర తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ అధ్యక్షతన పార్లమెంటరీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కప్పల వెలుగు కుమారి, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ తురకల నిర్మల, నగర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ద్వారా పార్వతి సుందరి నేతృత్వంలో, నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు సారథ్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర తొలి మహిళ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్ని కృష్ణ,జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాల రాయుడు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతున్నారని, ఆనాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు నాయుడు, లోకేష్ మహిళల అభ్యున్నతి కోసం ఎంతో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మహిళల భద్రత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రధానంగా నగరంలో మహిళల భద్రత కోసం అసాంఘిక శక్తులను, గంజాయి, బ్లేడ్ బ్యాచిలు వేరేస్తున్నామని వారిలో మార్పు రావాలని, లేదంటే మరింత చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా హెచ్పీవీ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నామని అన్నారు. నగరంలో చీకట్ల వాతావరణం లేకుండా రూ. 80 లక్షల రూపాయలతో 1300 విద్యుత్ లైట్లు వేయించామన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆడపిల్లలకే బంగారు భవిష్యత్తు ఉందని బాలికలను, మహిళలను ప్రోత్సహించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ దేశం పార్టీలో ముఖ్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోకేష్ లు మహిళల పక్షపాతిగా వారి అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని, మహిళలందరూ మహిళలందరూ వారికి మద్దతుగా నిలవాలని కోరారు. గన్నికృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎమ్మెల్యేలుగా నిలిచేందుకు సంసిద్ధం కావాలని మీ శక్తి యుక్తులు పెంపొందించుకోవాలని అన్నారు.

**కల్తీ పాల మృతులకు నివాళులు :**

కాగా ఇటీవల చోటు చేసుకున్న కల్తీ పాల ఘటనలో మృతి చెందిన 11 మంది ఆత్మకు శాంతి చేకూరాలంటూ వేడుకలు ప్రారంభానికి ముందుగా నివాళులర్పించారు. వారి కుటుంబాకు మనోధైర్యం ప్రసాదించాలని దేవుడిని వేడుకుని మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాకారులకు సత్కారం :**

ఈ సందర్భంగా బాలికలు నువ్వు కోలాటం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నగరంలోని విద్యా సంస్థలకు చెందిన పలు క్రీడ అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ నగరానికి వన్నె తెచ్చిన బాలిక క్రీడాకారులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, నగర తొలి మహిళ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మతో పాటు పలువురు ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించి నగదు బహుమతి అందజేశారు. తెలుగుదేశం పార్టీల్లో విశేషంగా పనిచేసిన సీనియర్ మహిళా నాయకురాళ్ళను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలకు ముందుగా వందలాదిగా మహిళలు డీలక్స్ సెంటర్ నుంచి భారీ ర్యాలీగా అల్యూమినియం అసోసియేషన్ హాలుకు చేరుకున్నారు.

# ద్వారక తిరుమల స్వామి మొక్కు తీర్చుకున్న నాళం రోశయ్య, సుజాత

**4టన్నుల కూరగాయలు అన్నదాన కార్యక్రమం నిమిత్తం అందజేత - ద్వారక తిరుమలలో స్వామి వారి సేవ చేసుకొనే భాగ్యం లభించింది**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం ద్వారక తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి డైరెక్టర్ గా పనిచేసిన నాళం సుజాత, రోశయ్య దంపతులు 4 టన్నుల కూరగాయలను అన్నదాన కార్యక్రమం నిమిత్తం ద్వారకా తిరుమలకు పంపించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి డైరెక్టర్ గా సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన స్వామి వారికి అన్నదానం నిమిత్తం కూరగాయలు అందిస్తామని నాళం రోశయ్య, సుజాతలు మొక్కుకున్నారు. ఈ మేరకు మొక్కు తీర్చుకుంటూ 4 టన్నుల కూరగాయలతో బుధవారం బయలుదేరిన టెంపో వాహనాన్ని కొంతమూరు ఫోర్త్ బ్రిడ్జి వద్ద సూర్య ఉపాసకులు వడలి కుమార శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాళం రోశయ్య, సుజాత దంపతులు చేస్తున్న ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలను అభినందించారు. స్వామి వారికి మరింతగా సేవచేసే అవకాశం భగవంతుడు నాళం దంపతులకు కల్పించాలని ఆకాంక్షించారు. నాళం రోశయ్య మాట్లాడుతూ ద్వారక తిరుమలలో స్వామి వారి సేవ చేసుకొనే భాగ్యం లభించడం పూర్వ జన్మ సుకృతం అని నాళం రోశయ్య అన్నారు. ఆ భాగ్యం కల్పించిన స్వామివారికి అన్నదానం నిమిత్తం కూరగాయలు అందించాలన్న మొక్కును తీర్చుకున్నామన్నారు. స్వామివారికి మరింతగా సేవ చేసి తరించే భాగ్యం కల్పించాలని స్వామి వారిని కోరుకుంటున్నామని అన్నారు. రాజానగరం మండలం వైసిపి నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు మాట్లాడుతూ నాళం రోశయ్య, సుజాత దంపతులు ట్రస్ట్ డైరెక్టర్ గా చేసిన సేవలు అభినందనీయం అన్నారు. ద్వారక తిరుమలలో శ్రీ స్వామి వారిని ఎంతోమంది భక్తులు దర్శించుకోవడానికి సహకరించారని, బస్సులను ఏర్పాటు చేసి ఎంతో మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పించారని తెలిపారు. దేవుని సేవ చేసేందుకు వీరికి మరొక సారి అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోణగిరి వెంకటేష్, ప్రియాంక, నక్షత్ర, నాళం సుబ్బలక్ష్మి, నాళం సత్య, పావని, వేముల తాతారావు, కామరెడ్డి వీరపండు, కామరెడ్డి బుజ్జి, మాచినీడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ మొండి భవాని పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం 28వ వార్డులో ఉన్న సర్దార్ శ్రీ వేగుళ్ళ వీర్రాజు హై స్కూల్ లో 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఆ వార్డు కౌన్సిలర్ మొండి భవాని తన సొంత ఖర్చులతో ప్యాడ్లు, పెన్నులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో ఉన్నత విద్యకు వెళ్ళడానికి పదవ తరగతి కీలకమన్నారు. విద్యార్థి దశలో కష్టపడితే నే జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లే అవకాశాలు ఉంటాయన్నారు. ఫోన్లకు, టీవీలకు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కౌన్సిలర్ మొండి భవాని మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో సర్దార్ శ్రీ వేగుళ్ళ వీర్రాజు స్కూల్ ఉండటం అదృష్టమన్నారు. కొద్దీ రోజుల్లో తమ పదవీకాలం ముగుస్తున్నప్పటికి తాము స్కూల్ అభివృద్ధికి చేసిన కృషి సంతృప్తినిచ్చిందన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి బాధ్యతగా చదువుకుని పదవ తరగతి పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు ఎం వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు పి.రామచంద్ర రెడ్డి, జి వి.వి కుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

### కాండ్రు వారి వివాహవేడుకలో పాల్గొన్న

## ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చిన్న కొండేపూడి గ్రామంలో కాండ్రు వారి వివాహ వేడుకలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పాల్గొని కాండ్రు శ్రీ వెంకటనారాయణ (లేటు) కుమారుడు నూతన వరుడిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరి వెంట జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉగాది రాజకీయ సంచలనం

**- మేడా వ్యాఖ్యలపై మళ్లీ చర్చ!**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో ఉగాది వేళ కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా గతంలో రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గతంలో ఆయన చేసిన వ్యాఖ్యల్లో "ఉగాది నాటికి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది" అని స్పష్టంగా పేర్కొన్నారు. అప్పట్లో ఆ వ్యాఖ్యలను కొంతమంది రాజకీయ విశ్లేషకులు పెద్దగా పట్టించుకోకపోయినా, ప్రస్తుతం రాష్ట్రంలో కనిపిస్తున్న రాజకీయ పరిణామాలు ఆ వ్యాఖ్యలకు కొత్త అర్థాన్ని తీసుకువస్తున్నాయని చెబుతున్నారు. ఇటీవల రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాల్లో మార్పులు, పార్టీల మధ్య వ్యూహాత్మక పరిణామాలు, కొన్ని కీలక నిర్ణయాలు ఉగాది సందర్భంగా వెలువడే అవకాశముందని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మేడా శ్రీనివాస్ ముందుగానే చేసిన వ్యాఖ్యానాలు ఇప్పుడు నిజం అవుతున్నాయా అనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం రాజకీయ పరిణామాలు చూస్తుంటే ఉగాది తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త మలుపు తిరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో "మేడా చెప్పింది నిజమేనా ?" అనే సందేహం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రేపటి ఉగాది సందర్భంగా రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయన్నదానిపై ప్రజలు మరియు రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

### అడ్డతీగల నుంచి లబ్బర్తి వరకు

# బీటి రోడ్డు నిర్మాణం తక్షణమే ప్రారంభించాలి





**అడ్డతీగల, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ,పోలవరం జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం అడ్డతీగల మండల పరిధిలోని అడ్డతీగల గ్రామం నుండి వయా డి.భీమవరం మీదుగా లబ్బర్తి వరకు సుమారు 16 కిలోమీటర్ల వరకు బిటి రోడ్డు ఈ ప్రభుత్వం మంజూరు చేసి సుమారు సుమారు 8 నెలలు కావస్తున్న ఎడ్మిక్స్ కాంట్రాక్టర్ పూర్తి చేయకుండా గుత్తేదారి పూర్తి స్థాయి పనులు చేయకుండా బిల్స్ వస్తేనే చేస్తానన్నటువంటి వ్యక్తులకు కాంట్రాక్టులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఆదివాసీ జేఏసీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్ల వల్ల టూ వీలర్ వెహికల్ వాహనదారులు, ఆటోలు కానీ ఈ ఏజెన్సీ ఏరియాలో ఉన్నటువంటి ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. కానీ ప్రభుత్వాలు మా గిరిజన ప్రాంతాలకు అద్దంలో చూపిస్తున్నాయి,ప్రభుత్వ పథకాలు అందని ద్రాక్షగా గిరిజనులకు మిగులుతున్నాయన్నారు. కానీ అందుకునే విధంగా చేయడం లేదని ఇవంతా కూడా ప్రశ్నార్థకంగా మిగిలిపోతాయి అనేటువంటి ఆందోళన చేశారు. ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో ఉన్న రోడ్డులను పరిశీలించామన్నారు. కావునప్రభుత్వ అధికారులు,ప్రజా ప్రతినిధులు తక్షణమే బీటు రోడ్డు పనులు ప్రారంభించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, గంపా నాగరాజు, అందాల లింగారెడ్డి, యాట్ల సరస్వతి, కోసూరి రాజారెడ్డి, గిరిజ, విజయ కుమారి, ధమాయంతి, ప్రభావతి, బొంజి బాబు, లక్కు వెంకట్, చిట్టి బాబు, కె.శ్రీను మొదలైన వారు పాల్గొన్నారు.

## విగ్మేట్- 2026 జాతీయ స్థాయి మేనేజ్మెంట్ మీట్‌లో ఆదిత్య విద్యార్థులు

**ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులు - అభినందించిన కళాశాల యాజమాన్యం**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం ఆదిత్య బి బి ఏ,ఎంబీఏ విద్యార్థులు విశాఖపట్నం విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వారు నిర్వహించిన విగ్మేట్ 2026 జాతీయస్థాయి మేనేజ్మెంట్ మీట్లో పాల్గొని వారు నిర్వహించిన హెచ్ఆర్ ఈవెంట్ కనెక్ట్ ఎక్స్ లో ప్రథమ బహుమతిని బి బి ఏ తృతీయ సంవత్సరం చదువుతున్న జీ నవీన్, పి జ్యోతిర్మయి, కె హర్షిని మరియు డి. యశ్వంతలు మొదటి బహుమతిని, అలాగే ఈ బృందం బిజినెస్ క్విజ్ లో ద్వితీయ బహుమతిని బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ మొదటి సంవత్సరం విద్యార్థులు కె సూచిత వీర్, ఐ.తులసి సత్య దుర్గ, డి.లలితా చందు ప్రియా బృందం పోస్టర్ మేకింగ్ లో ప్రథమ బహుమతిని, ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎం.రాకేష్, కే.ప్రభాస్, కే.చైతన్య సాయి, వి.విజయ సాయి, సిహెచ్ దుర్గాప్రసాద్ బృందం స్క్విడ్ గేమ్ లో ప్రథమ బహుమతిని, నగదు బహుమతిని సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ తెలియజేశారు. విజేతలను ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం అభినదించారు.

## మతసామరస్యతకు నిదర్శనం ఇఫ్తార్ విందులు



### టౌన్ సిఐ దారం సురేష్

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు మతసామరస్యతకు నిదర్శనమని మండపేట టౌన్ సిఐ సురేష్ అన్నారు. మండపేట జామియా మస్జిద్ కమిటి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. మండపేట కలువపువ్వు సెంటర్‌లో ఉన్న అహలే సున్నత్ వల్ జామియా మస్జిద్‌లో జరిగిన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ను మస్జిద్ కమిటి నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి సామరస్యం నెలకొల్పే రంజాన్ మాసంలో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. మసీదు ఇమామ్ ముహమ్మద్ గులామ్ ముర్షిద్ రజ్వీ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జామియా మస్జిద్ కమిటి అధ్యక్షులు ఎండి అతవుర్ రెహమాన్ అల్తాఫ్,టీడీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు షేక్ కరీం మెకానిక్, ఎండి సలీం, హాసేన్, జిలానీ, ఎండి గయసుద్దీన్, రాజులు, మైనార్టీ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

### మండల పరిధిలో అభివృద్ధి పనులను

## పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలంలోని ద్వారపూడి, కేశవరం గ్రామాలలో చేపట్టిన సి.సి రోడ్ల నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా నిర్వహించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు యరగతపు బాబ్జి,కంటిపూడి శ్రీనివాసరావు, ఉండమట్ల సురేష్, ఎంపిపి ఉండమట్ల వాసు, కర్రి సుభాష్, ఉండమట్ల శ్రీనివాస్, పినిపే రాజు, తొర్లపాటి ప్రసాద్, గారపాటి శ్రీనివాస్, కర్రి శ్రీనివాస్, కంటిపూడి సుభాష్, లంక సూరిబాబు, గనిశెట్టి సత్తిబాబు,చింతా దొర బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### హెచ్.పి.వి వ్యాక్సినేషన్ కార్యక్రమ శిబిరాన్ని

## సందర్శించిన నీరుకొండ వీరన్న చౌదరి




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో గల సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు 14 సం.ల నుండి 15 సం.ల వయస్సు ఉన్న బాలికలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రాకుండా హెచ్.పి.వి వ్యాక్సినేషన్ కార్యక్రమ శిబిరాన్ని రాజానగరం నియోజకవర్గ బిజెపి కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి సందర్శించారు .ఈ సందర్భంగా వీరన్న చౌదరి మాట్లాడుతూ హెచ్.పి.వి వ్యాక్సిన్ ఒక్క డోసు తీసుకోవడం ద్వారా జీవితాంతం గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ రాకుండా కాపాడబడతారని కావున నిర్భయంగా హెచ్.పి.వి వ్యాక్సిన్ వేయించుకొవాలని తెలియజేశారు. ఈ వ్యాక్సిన్ అత్యంత సురక్షితమని అందరికీ తెలియజేయాలని ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాపాక వెంకటలక్ష్మి, మద్దాల అర్చన, మద్దాల కొండలరావు, నీరుకొండ అచ్చుబాబు, సీతానగరం పిహెచ్సి వైద్యులు డాక్టర్ ఏ వి కె చైతన్య, డాక్టర్ ఎం శైలజ రాణి,పీహెచ్సీ వైద్య ఆరోగ్య సిబ్బంది, బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సడెన్‌గా ఓటీటీలోకి వచ్చేసిన

# అనుపమ కొత్త సినిమా..




ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో దక్షిణాదిలో బిజీగా ఉంది అనుపమ పరమేశ్వరన్. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గతేడాది అరడజనుకు పైగా సినిమాల్లో నటించి మెప్పించింది. అందులో దాదాపు మూడు నాలుగు సినిమాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అనుపమ పరమేశ్వరన్.. ఈ మలయాళీ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. టీనేజ్ లోనే ప్రేమమ్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ అఆ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత శతమానం భవతి సినిమాతో కథానాయకగా మారింది. తెలుగులో అత్యధిక చిత్రాల్లో నటించి టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన ముద్రవేసింది. సౌత్ ఇండస్ట్రీలో వరుస హిట్స్ అందుకుంటూ దూసుకుపోతుంది. గతేడాది అరడజను సినిమాలతో అలరించింది. వాటిలో దాదాపు మూడు నాలుగు సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కొత్త ఏడాదిలో ఓ థ్రిల్లర్ సినిమాతో వచ్చింది. అయితే ఇప్పుడు అదే సినిమా ఎలాంటి ప్రకటన లేకుండా నేరుగా ఓటీటీలోకి వచ్చేసింది. మలయాళం, తమిళంతోపాటు తెలుగులోనూ ఆ సినిమా స్ట్రీమింగ్ అవుతుంది. ప్రస్తుతం ఓటీటీలో సందడి చేస్తున్న సినిమా పేరు లాక్ డౌన్. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాను తమిళంలో రూపొందించారు. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ నిర్మించగా.. నూతన దర్శకుడు ఎఆర్ జీవా దర్శకత్వం వహించారు. అనేకసార్లు వాయిదా పడిన ఈ సినిమా జనవరి 30న థియేటర్లలో విడుదలైంది. కానీ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. లాక్ డౌన్ గురించి తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. కేవలం అనుపమ చుట్టూ మాత్రమే కథ తిరగడం.. అలాగే ఎప్పుడో గడిచిన లాక్ డౌన్ అంశాన్ని ఇప్పుడు తెరపైకి తీసుకురావడంతో ఈ సినిమాకు అంతగా రెస్పాన్స్ రాలేదు. ప్రస్తుతం ఈ సినిమా ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతుంది. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం భాషలలో స్ట్రీమింగ్ అవుతుంది. కథ విషయానికి వస్తే.. చదువు పూర్తి చేసిన ఓ అమ్మాయి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంటుంది. ఈ క్రమంలోనే తన స్నేహితులతో కలిసి ఓ పార్టీకి వెళ్తుంది. కొన్నాళ్లకు ఆమె ప్రెగ్నెంట్ అని తెలుస్తోంది. కానీ ఆ విషయాన్ని ఇంట్లో వాళ్ల ముందు దాచేస్తుంది. అప్పుడే లాక్ డౌన్ రావడంతో వైద్య సహాయం అందక ఇబ్బంది పడుతుంది. లాక్ డౌన్ కారణంగా అనుపమతోపాటు ఎంతో మంది పడిన ఇబ్బందులను ఈ చిత్రంలో చూపించారు. చివరకు అనుపమ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది అనేది సినిమా.

# పెళ్లైన 4 ఏళ్లకే విడాకులు తీసుకున్న హన్సిక..

సినీ వాయిస్ CINEMA

భరణం విషయంలో హీరోయిన్ సంచలన నిర్ణయం



ఒకప్పుడు టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది హన్సిక మెత్వానీ. అయితే ఆ తర్వాత ఎక్కువగా తమిళ సినిమాలకే పరిమితమైందీ అందాల తార. ప్రస్తుతం సినిమాలు బాగా తగ్గించేసిన ఈ ముద్దుగుమ్మ తన వ్యక్తిగత జీవితంతో తరచూ వార్తల్లో నిలుస్తోంది. హీరోయిన్ హన్సిక మొత్వానీ మూడు ముళ్ల బంధానికి ముగింపు పలికింది. చాలా రోజులుగా జరుగుతున్న ప్రచారాన్ని నిజం చేస్తూ తన భర్త, వ్యాపారవేత్త సోహెల్ ఖతూరియా నుంచి విడాకులు తీసుకుంది. పరస్పర అంగీకారంతోనే విడిపోవాలని నిర్ణయించుకున్నామని, తమకు విడాకులు మంజూరు చేయాలని హన్సిక బాంద్రా ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తాజాగా న్యాయస్థానం వీరికి విడాకులు మంజూరు చేసింది. హన్సిక-సొహైల్ లది ప్రేమ వివాహం. 2022 డిసెంబర్ 4న జైపూర్ ప్యాలెస్ లో వీరి పెళ్లి జరగింది. పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ గ్రాండ్ వెడ్డింగ్ కు హాజరయ్యారు. అయితే పెళ్లయిన రెండేళ్లకే వీరి మధ్య విభేదాలు మొదలయ్యాయి. చాలా కాలంగా వేర్వేరుగానే జీవిస్తున్న వీరు ఇప్పుడు విడాకులతో అధికారికంగా దూరమయ్యారు. 'మా మధ్య చిన్న విషయాలు కూడా తగాదాలుగా మారుతున్నాయి. ఒకే ఇంట్లో ఉండటం కూడా కష్టంగా ఉంది. 2024 జూలై 2 నుంచే తాము విడివిడిగా జీవిస్తున్నాం' అని హన్సిక తరపు అడ్వకేట్ కోర్టుకు వెల్లడించారు. కాగా విడాకుల కేసు విచారణ సమయంలో భర్త నుంచి ఎలాంటి భరణం అడగలేదు హన్సిక. కోర్టులోనూ ఈ విషయంలో ఎలాంటి వాదనలు జరగలేదు. కాగా చైల్డ్ ఆర్టిస్టుగా బాలీవుడ్‌లో సినిమాలు చేసిన హన్సిక పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వచ్చిన 'దేశముదురు' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. యాపిల్ బ్యూటీగా తన అందంతో కుర్రకారను కట్టి పడేసింది. ఎన్టీఆర్, రామ్ పోతినేని, ప్రభాస్, శింబు తదతర స్టార్ హీరోలతో సినిమాలు చేసింది హన్సిక. అయితే పెళ్లయ్యాక సినిమాలు బాగా తగ్గించేసిందీ అందాల తార. చివరిగా 2024లో రిలీజైన గార్డియన్ అనే సినిమాలో నటించిందీ ముద్దుగుమ్మ.

క్రీడా వాయిస్

వరల్డ్ నంబర్ 1 బౌలర్ బూమ్రాకు పాఠాలు చెప్పింది నేనేనంటున్న

# యూఏఈ ఫాస్ట్ బౌలర్..



ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్ ఎవరంటే వినిపించే మొదటి పేరు జస్‌ప్రీత్ బుమ్రా. తనదైన యార్కర్లు, స్లోయర్ బాల్స్‌తో దిగ్గజ బ్యాటర్లను సైతం వణికించే బుమ్రా గురించి ఇప్పుడు ఒక ఆసక్తికర వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది. పాకిస్థాన్ మూలాలు ఉన్న యూఏఈ ఫాస్ట్ బౌలర్ జహూర్ ఖాన్, బుమ్రాకు సంబంధించి ఒక షాకింగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. బుమ్రా వేసే ఆ భయంకరమైన స్లోయర్ బాల్స్ వెనుక ఉన్న రహస్యం తానేనని, ఆ విద్యను తానే బుమ్రాకు నేర్పించానని జహూర్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఒక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

**ఐపీఎల్ సమయంలో జరిగిన ముచ్చట**


జహూర్ ఖాన్ కథనం ప్రకారం.. ఈ ఘటన 2019 లేదా 2020 ఐపీఎల్ (యూఏఈ వేదికగా జరిగినప్పుడు) సమయంలో జరిగింది. అప్పట్లో ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్న బుమ్రా, ట్రెంట్ బౌల్ట్ వంటి స్టార్ బౌలర్లకు యూఏఈలోని విపరీతమైన వేడి, తేమ (హ్యూమిడిటీ) వల్ల బంతిని గ్రిప్ చేయడం కష్టంగా ఉండేదట. ఆ సమయంలో ముంబై ఇండియన్స్ మేనేజ్మెంట్ నెట్ బౌలర్‌గా జహూర్ ఖాన్‌ను పిలిపించింది. నెట్స్‌లో జహూర్ వేసే స్లోయర్ డెలివరీలు చూసి బుమ్రా ఆశ్చర్యపోయాడట. ఒకే యాక్షన్ తో, బంతి వేగాన్ని అంతగా ఎలా తగ్గించగలుగుతున్నావని బుమ్రా తనను అడిగినట్లు జహూర్ వివరించారు.

**బుమ్రా వచ్చి అడిగితేనే చెప్పాను**

నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు జహూర్ వేసిన స్లో బౌన్సర్లకు బ్యాటర్లు తడబడటం చూసి, అప్పటి ముంబై కోచ్ షేన్ బాండ్ కూడా ఆశ్చర్యపోయారట. ఆ తర్వాత బుమ్రా స్వయంగా తన దగ్గరకు వచ్చి, "పాజీ.. మీ గ్రిప్ ఏంటో నాకు చూపించండి" అని అడిగారని జహూర్ చెప్పారు. అప్పుడు తను బంతిని ఎలా పట్టుకోవాలో, యాక్షన్ మార్చకుండా వేగాన్ని ఎలా నియంత్రించాలో బుమ్రాకు చేసి చూపించానని, అది చూసిన బుమ్రా ఇది నిజంగా వేరే లెవల్ అని మెచ్చుకున్నారని జహూర్ చెప్పుకొచ్చారు. అంతటి వరల్డ్ క్లాస్ బౌలర్ తనను అడగడం తనకు చాలా గౌరవంగా అనిపించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఈ విషయమై బుమ్రా నుంచి గానీ, ముంబై ఇండియన్స్ నుంచి గానీ ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు.

# నేడే ఐపీఎల్ 2026 షెడ్యూల్ విడుదల..

సాయంత్రం 7 గంటలకు లైవ్ అప్‌డేట్



బీసీసీఐ సెక్రటరీ దేవజీత్ సైకియా గతంలో చెప్పినట్లుగానే, నేడు (మార్చి 11, బుధవారం) ఐపీఎల్ కొత్త సీజన్ షెడ్యూల్‌ను విడుదల చేయబోతున్నారు. అయితే మొత్తం టోర్నీ షెడ్యూల్‌ను కాకుండా, కేవలం మొదటి 20 రోజులకు సంబంధించిన మొదటి దశ షెడ్యూల్‌ను మాత్రమే ఈరోజు ప్రకటించనున్నారు. టీ20 వరల్డ్ కప్ ముగియడంతో క్రికెట్ అభిమానుల చూపు ఇప్పుడు ఐపీఎల్ 2026 వైపు మళ్లింది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ షెడ్యూల్‌పై ఎట్టకేలకు ఒక క్లారిటీ వచ్చేసింది. బీసీసీఐ సెక్రటరీ దేవజీత్ సైకియా గతంలో చెప్పినట్లుగానే, నేడు (మార్చి 11, బుధవారం) ఐపీఎల్ కొత్త సీజన్ షెడ్యూల్‌ను విడుదల చేయబోతున్నారు. అయితే మొత్తం టోర్నీ షెడ్యూల్‌ను కాకుండా, కేవలం మొదటి 20 రోజులకు సంబంధించిన మొదటి దశ షెడ్యూల్‌ను మాత్రమే ఈరోజు ప్రకటించనున్నారు.

**ఎక్కడ, ఎప్పుడు లైవ్‌లో చూడాలి?**

ఐపీఎల్ 2026 షెడ్యూల్ ప్రకటన నేటి సాయంత్రం 7 గంటలకు వెలువడనుంది. ఈ వేడుకను అభిమానులు టీవీలో స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. ఇక మొబైల్ లేదా ఇంటర్నెట్‌లో చూడాలనుకునే వారు జియో హాట్‌స్టార్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్‌ను ఉచితంగా చూడొచ్చు. నిజానికి ఈ షెడ్యూల్‌ను మార్చి 8న వరల్డ్ కప్ ఫైనల్ రోజే విడుదల చేయాలని భావించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల అది నేటికి వాయిదా పడింది.

**మార్చి 28 నుంచే క్రికెట్ పండగ**


తాజా నివేదికల ప్రకారం.. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28న అట్టహాసంగా ప్రారంభం కానుంది. గతంలో మార్చి 26నే మొదలవుతుందని వార్తలు వచ్చినప్పటికీ, రెండు రోజులు అటు ఇటుగా మార్చి 28ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్ మే 31న జరగనుంది. సుమారు రెండు నెలల పాటు సాగే ఈ క్రికెట్ జాతరలో మొత్తం 10 జట్లు హోరాహోరీగా తలపడనున్నాయి.

**తొలి మ్యాచ్ ఎవరి మధ్య?**

ఐపీఎల్ నిబంధనల ప్రకారం, సీజన్ ఆరంభ మ్యాచ్ ఎప్పుడూ డిఫెండింగ్ ఛాంపియన్ హోమ్ గ్రౌండ్‌లోనే జరుగుతుంది. ఆ లెక్కన గత ఏడాది టైటిల్ గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తన సొంత గడ్డపై మొదటి మ్యాచ్ ఆడనుంది. ఈ పోరులో ఆర్‌సీబీకి ప్రత్యర్థిగా గత సీజన్ రన్నరప్ పంజాబ్ కింగ్స్ తలపడే అవకాశం ఉందని సమాచారం. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగబోయే ఈ మ్యాచ్‌తో ఐపీఎల్ 19వ సీజన్‌కు తెరలేవనుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com